తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
బుధవారం
04 నవంబర్ 2026
Follow :

డ్రోన్‌తో మందుల పిచికారీ..

రైతులకు శ్రమ తగ్గింపు!



సాంకేతికత వైపు అడుగులు వేస్తున్న రైతులు

- **కూలీల కొరతకు పరిష్కారంగా డ్రోన్ టెక్నాలజీ**
- **తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారీ**
- **నీటి వినియోగం తగ్గడంతో పాటు సాగు ఖర్చులకు ఆదా**
- **డ్రోన్ ఆపరేటింగ్‌తో యువతకు ఉపాధి అవకాశాలు**

కోహిర్, నవంబర్ 3 (జనంసాక్షి): వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకూ విస్తరిస్తోంది. ఒకప్పుడు పంటలకు పురుగుమందులు, తెగుళ్ల నివారణ మందులు పిచికారీ చేయాలంటే రైతులు కూలీలపై ఆధారపడేవారు. ప్రస్తుతం కూలీల కొరత, పెరుగుతున్న వ్యవసాయ ఖర్చుల నేపథ్యంలో డ్రోన్ టెక్నాలజీ రైతులకు ప్రత్యామ్నాయంగా మారుతోంది. ఆధునిక పద్ధతులను అందిపుచ్చుకుంటూ కొందరు రైతులు డ్రోన్ల ద్వారా పంటలకు మందులు పిచికారీ చేయిస్తున్నారు. దీంతో సమయం, శ్రమ ఆదా అవుతున్నాయని రైతులు భావిస్తున్నారు.

చెరుకు పంటకు డ్రోన్ పిచికారీ ఎంతో సులభం...

చెరుకు సాగులో పురుగుమందుల పిచికారీ రైతులకు శ్రమతో కూడుకున్న పని. చెరుకు పంట ఎదిగిన తర్వాత పది నుంచి పన్నెండు అడుగుల ఎత్తు వరకు పెరుగుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో కూలీలు లోపలికి వెళ్లి స్ప్రేయర్లతో మందులు పిచికారీ చేయడం కష్టంగా మారుతుంది. పవర్ స్ప్రేయర్లతో పిచికారీ చేసినా పంటలోని అన్ని ఆకులకు మందు చేరడం కొంత ఇబ్బందికరంగా ఉంటుంది. ఈ సమస్యలకు డ్రోన్ పిచికారీ కొంతవరకు పరిష్కారంగా నిలుస్తోంది. పొలంలోకి వెళ్లాల్సిన అవసరం లేకుండానే పై నుంచి పంట అంతటా మందును పిచికారీ చేసే అవకాశం ఉండటంతో చెరుకు రైతులు ఈ విధానంపై ఆసక్తి చూపుతున్నారు.

నీటి వినియోగం తగ్గింపు.. ఖర్చులకు ఆదా

సాధారణ పద్ధతిలో ఒక ఎకరా పంటకు మందులు పిచికారీ చేయడానికి సుమారు 300 లీటర్ల వరకు నీరు వినియోగిస్తుంటారు. అదే డ్రోన్ ద్వారా పిచికారీ చేయడానికి సుమారు 18 లీటర్ల నీటితో పని పూర్తవుతుందని ఈ విధానాన్ని వినియోగిస్తున్న వారు చెబుతున్నారు. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారీ చేసే అవకాశం ఉండటంతో నీటి వినియోగం తగ్గుతుంది. అంతేకాకుండా కూలీల ఖర్చు, సమయం కూడా ఆదా అవుతాయి.

రైతుల ఆరోగ్యానికి రక్షణ

పురుగుమందులు పిచికారీ చేసే సమయంలో రైతులు నేరుగా రసాయనాల ప్రభావానికి గురయ్యే ప్రమాదం ఉంది. దీర్ఘకాలం పాటు రక్షణ చర్యలు పాటించకుండా మందులు పిచికారీ చేస్తే ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. డ్రోన్ పద్ధతిలో రైతులు నేరుగా పంటలోకి వెళ్లాల్సిన అవసరం తగ్గుతుంది. అయితే డ్రోన్ పిచికారీ సమయంలో కూడా పరిసర ప్రాంతాల్లో ఉన్నవారికి రసాయనాల ప్రభావం పడకుండా తగిన జాగ్రత్తలు పాటించడం అవసరం.

యువతకు ఉపాధి అవకాశాలు

వ్యవసాయంలో డ్రోన్ వినియోగం పెరుగుతుండటంతో డ్రోన్ ఆపరేటర్లకు కూడా ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. శిక్షణ పొందిన యువత డ్రోన్ల ద్వారా పంటలకు మందులు పిచికారీ చేస్తూ ఆదాయం పొందే అవకాశం ఏర్పడుతోంది. భవిష్యత్తులో వ్యవసాయ రంగంలో మరిన్ని ఆధునిక సాంకేతిక పద్ధతులు అందుబాటులోకి వస్తే రైతులకు ప్రయోజనం చేకూరడంతో పాటు గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు మరింత పెరిగే అవకాశం ఉంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ రైతులు ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



కూలీల ఖర్చు తగ్గుతుంది

చెరుకు పంట ఎత్తుగా పెరుగు తుంది. చెరుకు పైన చేతిపంపు లతో పిచికారీ చేయడం కష్టం. డ్రోన్తో మందు పిచికారీ చేస్తే ఖర్చులు తగ్గుతాయి. డ్రోన్తో పిచికారీకి ఎకరా నికి రూ.500 చెల్లిస్తున్నాం. డ్రోన్తో ఎకరం పిచికారీకి బిందె నీరు సరిపో తుంది. సాధారణ స్ప్రేలతో ఐదెకరాల్లో పిచికారీకి నలుగురు కూలీలు అవసరం. అదే డ్రోన్తో చేస్తే అందులో సంగం ఖర్చుతో అయి పోతుంది. సజ్జాపూర్. యం. సుధాకర్ తెలిపాడు

కొమురవెల్లి
తహసీల్దార్ కార్యాలయంలో అక్రమాల ఆరోపణలు..?

- **కాసులిస్తేనే కదులుతున్న ఫైళ్లు..?**
- **సామాన్యులను పట్టించుకోని తీరు..**
- **రైతులతో దురుసు ప్రవర్తన**

కొమురవెల్లి (జనంసాక్షి) :
కొమురవెల్లి తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి అక్రమాలు రాజ్యమేలుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాసులు ఇస్తేనే ఫైళ్లు కదులుతున్నాయని, లేకుంటే నెలల తరబడి పెండింగ్ లో ఉంటున్నాయని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల స్థాయి ప్రథమ శ్రేణి అధికారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, సామాన్యుల గోడు పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తు తున్నాయి.
కార్యాలయానికి వచ్చే రైతులు, ప్రజలతో దురుసుగా ప్రవర్తిస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. ఇటీవల ఓ రిజిస్ట్రేషన్ విషయంలో భారీ అక్రమాలు జరిగినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ఆ మహిళా అధికారి పాత్రపై మండల ప్రజలు బగ్గుమంటున్నారు. పలువురు ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అధికారి తీరుపై పూర్తి వివరాలతో త్వరలో ఫస్ట్ ఎపిసోడ్..

పై వంతెన నిర్మాణంలో
నాణ్యతను పరిశీలించిన అధికారులు



రాజాపూర్, నవంబర్ 3 (జనంసాక్షి):
రాజాపూర్ మండల కేంద్రంలో నిర్మిస్తున్న పై వంతెన నిర్మాణంలో నాణ్యతను పరిశీలించిన జాతీయ రహదారి 44 అథారిటీ క్వాలిటీ చెక్ అధికారులు. ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులు చేస్తున్న కాంట్రాక్టర్ లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన హైవే అథారిటీ అధికారులు. బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన ప్లాన్ లేకపోవడం, మట్టిలేయర్లు వేయాల్సిన అన్ని వేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.
ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనుల్లో సైడ్ గోడకు లీకేజీ కాకుండా వేసే ప్యాచ్‌ను క్వాలిటీ చెక్ చేయకుండా నాసిరకం వేస్తున్నారని హైవే అథారిటీ సెంట్రల్ క్వాలిటీ చెక్ అధికారులు కాంట్రాక్టర్‌పై తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

రెవెన్యూ సేవల్లో అలసత్వాన్ని సహించేది లేదు

- **భూ రీసర్వేలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు: కలెక్టర్ ప్రతిమాసింగ్**


మిగతా 9లో..



మెదక్ బ్యూరో, నవంబర్ 3 (జనంసాక్షి): రెవెన్యూ సేవల్లో అలసత్వాన్ని సహించేది లేదని, పారదర్శక పాలన లక్ష్యంగా తహసీల్దార్లు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో భూధార్, భూ రీ సర్వే, ధాన్యం కొనుగోళ్లు, ట్రిపుల్ ఆర్, ప్రజావాణి పెండింగ్ సమస్యలపై ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతోపాటు భూ రికార్డుల్లో పారదర్శకత పెంచేందుకు ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సర్వేకు ముందుగా రైతులకు సమాచారం అందించి, వారి సమక్షంలోనే భూముల సరిహద్దులు గుర్తించాలని సూచించారు. తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి సర్వే పనులను పర్యవేక్షించాలన్నారు. నిర్లక్ష్యం వహించే అధికారులపై, సర్వేయర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
ఆధార్ తరహాలో ప్రతి భూమికి 12 అంకెల ప్రత్యేక భూధార్ నంబర్ కేటాయించే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. భూధార్ నంబర్‌ను ల్యాండ్ బేస్డ్ మ్యాప్‌తో అనుసంధానం చేయడం ద్వారా భూముల హక్కులు, సరిహద్దులపై స్పష్టత వస్తుందని

కరువు బాధిత రైతులు, కూలీలను తక్షణమే ఆదుకోవాలి...

- ప్రతి కుటుంబానికి నెలకు రూ.15 వేల సాయం
- ఎకరాకు రూ.30 వేల పంట నష్టపరిహారం అందించాలి: సీపీఐ నేత బాల నరసింహ



వనపర్తి రూరల్, నవంబర్ 2 (జనంసాక్షి): వనపర్తి జిల్లాలో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు, రైతు కూలీలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాల నరసింహ డిమాండ్ చేశారు. సోమవారం వనపర్తి మండలంలోని అంజనగిరి, దత్తాయిపల్లి, దత్తాయిపల్లి తండాల్లో సీపీఐ బృందం పర్యటించి ఎండిపోయిన పంటలను పరిశీలించింది.

ఈ సందర్భంగా బాలనరసింహ మాట్లాడుతూ..

అంజనగిరి గ్రామానికి కాసింనగర్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందిస్తామని ఇచ్చిన హామీ నెరవేరకపోవడంతో రైతులు బోరుబావులపై ఆధారపడి సాగు చేస్తున్నారని తెలిపారు. నీటి లభ్యత లేక సుమారు 100 ఎకరాల్లో వరి పంటలు ఎండిపోయాయని పేర్కొన్నారు. నాలుగు ఎకరాల్లో వరి సాగు చేసిన రైతు పెద్ద దేవన్నకు బోరుబావిలో నీరు అడుగంటడంతో పంట చేతికందకుండా పోయిందన్నారు. మరో రైతు రూ.1.60 లక్షలు ఖర్చు చేసి రెండు బోర్లు వేయించినా నీరు పడక నష్టపోయాడని వివరించారు. దత్తాయిపల్లి, తండాల్లో సుమారు 80 శాతం వరి పంటలు ఎండిపోయాయని, కేఎల్ఐ కాల్వలు ఉన్నప్పటికీ సాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడుల కోసం చేసిన అప్పులు తీర్చలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

ప్రభుత్వానికి సీపీఐ డిమాండ్లు...

కరువు బాధిత ప్రతి కుటుంబానికి వచ్చే ఏడాది జూన్ వరకు నెలకు రూ.15 వేల ఆర్థికసాయం అందించాలని, ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.30 వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతుల పంట రుణాలు మాఫీ చేయాలని, రేషన్ ద్వారా ప్రతి వ్యక్తికి నెలకు 15 కిలోల బియ్యం పంపిణీ చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద ప్రతి కుటుంబానికి 200రోజుల పని కల్పించి, రోజువారీ కూలీని రూ.600కు పెంచాలని కోరారు. పశువులకు ఉచితంగా పశుగ్రాసం పంపిణీ చేసి, అవసరమైన చోట పశుగ్రాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు.





పిల్ల కాలువలు నిర్మించాలి...

కేఎల్ఐ, జూరాల, భీమా ప్రాజెక్టుల నుంచి పిల్ల కాలువలు నిర్మించకపోవడంతో చివరి ఆయకట్టుకు సాగునీరు అందడం లేదని విమర్శించారు. ప్రతి గ్రామానికి, చివరి పొలానికి నీరు చేరేలా పిల్ల కాలువల నిర్మాణానికి భూసేకరణ చేపట్టి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, నియోజకవర్గ కార్యదర్శి రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్, జె. చంద్రయ్య, పృథ్వినాదం, చిన్న కుర్మయ్య, శివ, మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు నారాయణ తదితరులు పాల్గొన్నారు. రైతులు తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు.

బాలికల పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా
- విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశం



బెజ్జంకి,నవంబర్ 3 (జనంసాక్షి): మండల కేంద్రంలోని బాలికల పాఠశాలను జిల్లా కలెక్టర్ కె.హైమావతి మంగళవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా పరిశీలించి నాణ్యతపై ఆరాతీశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, పాఠశాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంతోపాటు పారిశుద్ధ నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రధానోపాధ్యాయురాలుకు ఆదేశించారు. తనిఖీ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీకాంత్, సర్పంచ్ బొల్లం శ్రీధర్, ఉపసర్పంచ్ దుమాల మహేష్, సంబంధిత అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు షూస్, సాక్సులు, బెల్టులు పంపిణీ

- విద్యార్థుల భవిష్యత్తే గ్రామ భవిష్యత్తు
- సర్పంచ్ గూడెల్లి శ్రీకాంత్



బెజ్జంకి, నవంబర్ 3, (జనంసాక్షి): మండలంలోని గూడెం గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ గూడెల్లి శ్రీకాంత్ మంగళవారం విద్యార్థులకు షూస్, సాక్సులు, బెల్టుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని పంపిణీ చేశారు. అనంతరం శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన వస్తువులు అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తే గ్రామ భవిష్యత్తు అని,నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రేవతి, ఉపసర్పంచ్ యాలల పరశురాములు, ఉపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జకీనాలపల్లి గ్రామపంచాయతీలోనే మఠం తండాను కొనసాగించాలి

- అమ్మపల్లి గ్రామ పంచాయతీ ప్రపోజల్ నుండి తొలగించాలని ఎంపీడీవోకు వినతి



ఊర్కొండ, నవంబర్ 3 (జనంసాక్షి);

నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం జకినాలపల్లి గ్రామ పంచాయతీలోని మఠం తండా వాసులు తమ తండాను అమ్మపల్లి తండా గ్రామ పంచాయతీ ప్రపోజల్ నుండి తొలగించాలని, జకినాలపల్లి గ్రామ పంచాయితీలో కొనసాగించాలని కోరుతూ ఎంపీడీవో సత్యపాల్ రెడ్డికి మంగళవారం రోజు వినతి పత్రం అందజేశారు. తమ తండాకు ప్రత్యేక గుర్తింపు ఉందని, కాబట్టి ప్రతిపాదన నుండి తొలగించి జకినాలపల్లి గ్రామపంచాయతీలోనే యధావిధిగా కొనసాగించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మణిపాల్ నాయక్, లింగ్యా,భాస్కర్,శంకర్, భీమ్లా, పవన్ రాజ్‌కుమార్, శ్రీను, జేమ్లా, రెక్య,చంద్రు, హనుమంతు, పాండు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి

- సర్పంచ్ బైరా మానస రాజేందర్



బెజ్జంకి,నవంబర్ 3(జనంసాక్షి): మండలంలోని దాచారం గ్రామ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత,ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న బైలు,బెల్టులు,షూలను మంగళవారం గ్రామ సర్పంచ్ బైరా మానస రాజేందర్ పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నరేందర్, రవీందర్, ఉపసర్పంచ్ దీటి బాలనర్స్, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి వాకిటి శ్రీహరికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు



మక్తల్, నవంబర్ 3 (జనంసాక్షి):

మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి జన్మదినం పురస్కరించుకుని మక్తల్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. గతంలో జన్మదిన వేడుకల సమయంలో మంత్రి శ్రీహరి అధికారిక పనులపై, ఢిల్లీలో జరిగిన నిరసన కార్యక్రమంలో బిజీగా ఉండడం వల్ల శుభాకాంక్షలు తెలపలేకపోయారు. ఈ నేపథ్యంలో, మంగళవారం ఆయన మక్తల్‌కు విచ్చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని స్థానిక కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మక్తల్ కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు ఆలుకూరి రవికుమార్ ఆధ్వర్యంలో మంత్రికి ప్రత్యేకంగా పూల కుండీ (ప్లాంట్ వాజ్) అందించి, ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్య ఐశ్వర్యాలతో సుఖసంతోమలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా టౌన్ అధ్యక్షుడు ఆలుకూరి రవికుమార్ మాట్లాడుతూ మక్తల్ నియోజకవర్గాన్ని సుమారు 2,000 కోట్ల నిధులతో ప్రగతి పథంలో నడిపిస్తున్న ప్రజానాయకుడు డాక్టర్ వాకిటి శ్రీహరి అని కొనియాడారు. నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి మంత్రి చేస్తున్న కృషికి ప్రతీ కార్యకర్త, నాయకుడు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. మక్తల్‌ను రాష్ట్రంలోనే నెంబర్ వన్ నియోజకవర్గంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు సాగుతున్న ఆయనకు ప్రజలందరి సహకారం ఎప్పటికీ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ నమోదుకు గడువు పెంచాలి

- బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.బలరాం రెడ్డి



మక్తల్, నవంబర్ 03(జనంసాక్షి):

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ నమోదు ప్రక్రియలో నెట్‌వర్క్ సమస్యలతో పట్టభద్రులు గత మూడు రోజుల నుంచి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఓటర్ నమోదుకు మరో మూడు రోజులే తుది గడువు ఉన్నందున ప్రభుత్వం స్పందించి గడువును పెంచాలని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి జి. బలరాం రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం మక్తల్ తహశీల్దార్ సతీష్‌కుమార్‌ను బిజెపి నాయకులు ప్రత్యేకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు రోజులుగా ఓటర్ నమోదు కోసం నెట్ సెంటర్ల చుట్టూ తిరుగుతున్నప్పటికీ, సాంకేతిక సమస్యతో ఓటరు నమోదు ప్రక్రియ ముందుకు సాగడం లేదన్నారు.

జిల్లా వ్యాప్తంగా వేలాది మంది పట్టభద్రులు ఇంకా తమ ఓటును నమోదు చేసుకునేందుకు వీలుగా ఓటర్ నమోదుకు గడువును పొడిగించాలని కోరారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కర్ని స్వామి, మాద్వార్ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, నాయకులు కనకరాజు, జావేద్, సురేష్, జనార్దన్, లక్ష్మీపతి, వెంకటరెడ్డి, ఎల్లలింగప్ప, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పోతేపల్లి పట్టభద్రుల ఓటర్ల నమోదు..

- తహసీల్దార్‌కు దరఖాస్తుల అందజేత



వెల్దండ, నవంబర్ 03 (జనంసాక్షి):పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను బీఆర్ఎస్ నాయకులు చేపట్టారు. ఈ సందర్భంగా ఉమ్మడి పోతేపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పట్టభద్రుల ఓటర్ల వివరాలను నమోదు చేసి, సంబంధిత దరఖాస్తులను మంగళవారం వెల్దండ తహసీల్దార్ బీశ్వ కార్తీక్‌కుమార్‌కు అందజేశారు. మండల బీఆర్ఎస్ యువ నాయకులు అంజి మాస్టర్, పోతేపల్లి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి మంగళపల్లి వెంకటయ్య ఆధ్వర్యంలో, పోతేపల్లి ఉపసర్పంచ్ శారదా బాలయ్య గౌడ్ నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓ శ్రీనివాసులు, బీఆర్ఎస్ నాయకులు జంగిలి నిరంజన్, మాజీ ఎంపీటీసీలు హనుమంతు నాయక్, వార్డు సభ్యుడు గోరటి అశోక్ కుమార్, జంగిలి ఆనంద్, మాజీ సర్పంచ్ ప్రభాకర్, బోయినపల్లి రవి గౌడ్,తాండ్ర శ్రీను, జోగు రవి తదితరులు పాల్గొన్నారు.

నిత్యం మిషన్ భగీరథ పైప్ లీకేజీ తప్పని నీటి తిప్పలు



రాజాపూర్, నవంబర్ 3 (జనంసాక్షి): మండల పరిధిలోని రాయపల్లి గ్రామ పరిధిలో, ముదిరెడ్డి జాతీయ రహదారిపై నిత్యం ఎక్కడో ఒక చోట మిషన్ భగీరథ పైప్ లైన్లు పగలడం నీటి సరఫరా బంద్ అవడం నిత్యం పరిపాటిగా మారింది. దీనిపై ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎస్ఐ బాలరాజు సేవలు మరువలేనివి



రామాయంపేట, నవంబర్ 3 (జనంసాక్షి): రామాయంపేట పోలీస్ స్టేషన్‌లో రెండేళ్లకు పైగా ఎస్ఐగా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందిన డి.బాలరాజు సేవలు మరువలేనివని బీజేపీ నాయకులు కొనియాడారు. బదిలీపై వెళ్తున్న ఆయనకు శుభా కాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బాలరాజు రాజకీయాలకు అతీతంగా ప్రజలతో మమేకమై, అందరితో ఆప్యాయంగా మెలిగారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై సాను కూలంగా స్పందిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేశారని తెలిపారు. సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటూ యువతకు మార్గ దర్శకంగా నిలిచారని అన్నారు. ఎక్కడ విధులు నిర్వహించినా ఇదే అంకితభావంతో ప్రజలకు సేవలందిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు, యాదగిరి, భానుచందర్, అక్కల అనిల్, రంగయ్య, బండి గిరి, నాగరాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆందోల్ నియోజకవర్గంలో రూ.2 వేల కోట్ల అభివృద్ధి పనులు

- **అభివృద్ధిని చూసి ఓర్వలేకే మంత్రిపై అసత్య ఆరోపణలు**
- **మంత్రి గౌరవాన్ని మరిచి మాట్లాడితే సహించేది లేదు**
- **మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ**



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 3 (జనంసాక్షి): అందోల్ నియోజక వర్గంలో రూ.2 వేల కోట్లకు పైగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నా యని అభివృద్ధిని చూసి ఓర్వలేకే ప్రతిపక్ష పార్టీలు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పై విమర్శలు చేస్తున్నారని ఆందోల్– జోగిపేట్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు) మండిపడ్డారు. మంగళవారం జోగిపేటలో ఆయన మాట్లాడుతూ... ఢిల్లీ శాంగ్రిలా హోటల్‌లో రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు మధ్య వాగ్వాదం జరిగిందంటూ మీడి యాలో వస్తున్న కథనాలలో నిజం లేదన్నారు. అందోల్ నియోజకవర్గంలో రూ.2 వేల కోట్లకు పైగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, వాటిపై చర్చించకుండా నిరాధార ఆరోపణలకు ప్రాధాన్యం ఇవ్వడం సరికాదన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ సహనం, ఓర్పు, క్రమశిక్షణ కలిగిన నాయకుడని, ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే లక్షణాలను పార్టీ నాయకులకు నేర్పించారని గుర్తు చేశారు.

రాజకీయంగా ఎదిగేందుకు అవకాశం కల్పించిన నాయకుడి గౌరవాన్ని మరిచి మాట్లాడటం తగదని హితవు పలికారు. బీఫాం ఇచ్చి రాజకీయాల్లో నిలబెట్టిన నాయకుడి పట్ల కృతజ్ఞతతో ఉండాలని సూచించారు. నాయకుడి గొప్పతనంతో బీఫాం లభిస్తుందని, ప్రజల ఆశీర్వాదంతో విజయం సాధిస్తారని, ఎదిగాక కృతజ్ఞత మరిచిపోవడం రాజకీయ అహంకారానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. మంత్రి దామోదర రాజనర్సింహ నాయకత్వాన్ని విమర్శలతో తగ్గించలేరని, ఆయన అభిమానుల ఆత్మగౌరవాన్ని తక్కువ అంచనా వేయవద్దని చిట్టిబాబు హెచ్చరించారు.

విద్యలో కోహిర్ మండలాన్ని ప్రథమ స్థానంలో నిలపాలి

- **సమర్థవంతమైన బోధనా పద్ధతులను అవలంబించాలి: ఎంఈఓ మహమ్మద్ జాకీర్ హుస్సేన్**



కోహిర్, నవంబర్ 3 (జనంసాక్షి): విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఉపాధ్యాయుల క్రమశిక్ష ణ, సబ్జెక్టుపై పట్టు, సమయపాలన కీలక మని ఎంఈఓ మహమ్మద్ జాకీర్ హుస్సేన్ అన్నారు. మంగళవారం బిలాల్‌పూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి ప్రతిభను గుర్తించి, సామర్థ్యాలకు అనుగుణంగా బోధన అందించాలని సూచిం చారు. కోహిర్ మండలాన్ని విద్యారంగంలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు ఉపాధ్యాయు లంతా సమష్టిగా కృషిచేయాలన్నారు.

ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం (ఎఫ్ఎల్ఎన్)లో విద్యార్థులు నిర్దేశిత లక్ష్యా లను సాధించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. వినూత్న బోధనా పద్ధతులు, బోధ నాభ్యసన సామగ్రిని వినియోగించాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యాశాఖ ఆన్ లైన్ కార్యక్రమాలను గడువులోగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ప్రధానోపా ధ్యాయురాలు సుచరిత, ఎంఆర్పీలు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

నాగ్‌ధర్ జడ్పీహెచ్ఎస్‌లో కాంప్లెక్స్ సమావేశం



నిజాంపేట్, నవంబర్ 03 (జనంసాక్షి): నిజాంపేట్ మండలంలోని నాగ్‌ధర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళ వారం రోజున కాంప్లెక్స్ స్థాయి సమావేశం ఘనం గా నిర్వహించారు.ఈ సమావేశానికి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాములు మాట్లాడుతూ ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రమా ణాలు పెంపొందించే అంశాలు, 10వ తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతులు, హాజరు శాతం పెంపు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై విస్తృతంగా చర్చించారు.అలాగే విద్యార్థుల్లో చదువు పట్ల ఆసక్తి పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలు, తల్లిదండ్రుల భాగ స్వామ్యం, స్వచ్ఛ పాఠశాల వంటి అంశాలపై సూచనలు చేశారు. విద్యాశాఖ ఆదేశాలను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని కాంప్లెక్స్ హెచ్ఎం సూచించారు.ఈ సమావేశంలో మండల విద్యా శాఖ అధికారులు,కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు.. మెడికల్ షాపులపై అధికారుల కొరడా!

- **వనపర్తి పట్టణంలోని ఆసుపత్రుల అనుబంధ మందుల దుకాణాల్లో విస్తృత తనిఖీలు**



వనపర్తి, నవంబర్ 3 (జనంసాక్షి): పట్టణంలోని వివిధ ఆసుపత్రులకు అనుబంధంగా నిర్వహిస్తున్న మందుల దుకాణాలపై టీజీ సేఫ్–ఔషధ నియంత్రణ విభాగం అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ఉప సంచాల కురాలు అంజుమ్ అబిద ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీల్లో మందుల విక్రయానికి సంబంధించిన నిబంధనల అమలును క్షుణ్ణంగా పరిశీలించారు. మందుల దుకాణాల్లో నమోదిత ఔషధ నిపుణులు అందుబాటులో ఉన్నారా, మందుల కొనుగోలు, విక్రయాల రికార్డులు సక్రమంగా నిర్వహిస్తున్నారా, వైద్యుల చీటీ లేకుండా విక్రయించరాని మందులను నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్నారా అనే అంశాలను తనిఖీ చేశారు. ముఖ్యంగా షెడ్యూల్ హెచ్–1 మందుల విక్రయ వివరాల నమోదు, గడువు ముగిసిన మందుల నిల్వలు, మందుల భద్రపరిచే విధానం, అనుమతులు, ఇతర చట్టబద్ధ మైన పత్రాలను పరిశీలించారు.


ఈ తనిఖీల్లో నిబంధనల ఉల్లంఘనలు గుర్తించిన దుకాణాల యాజమాన్యాలకు వివరణ కోరుతూ నోటీసులు జారీ చేయనున్నట్లు అధికారులు తెలి పారు. వారి వివరణలను పరిశీలించిన అనంతరం చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశా రు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన మందులు అందించడమే ఔషధ నియంత్రణ విభాగం లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు. ప్రతి మందుల దుకాణంలో





నమోదిత ఔషధ నిపుణుడు నిరంతరం అందుబాటు లో ఉండాలని, ఔషధాలు, సౌందర్య సాధనాల చట్టం నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచిం చారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, మందుల విక్రయంలో అక్రమాలు, నిర్లక్ష్యం, నిబంధనల ఉల్లంఘనలను ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో మహబూబ్‌నగర్ సహాయ సంచాలకురాలు డి. సరిత, రంగారెడ్డి సహాయ సంచాలకుడు జి. ప్రసాద్, వనపర్తి జిల్లా ఔషధ నియంత్రణ అధికారి రష్మితో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకుచెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ సమావేశం



కోహిర్, నవంబర్ 3 (జనంసాక్షి): కోహిర్ మండలం బిలాల్‌పూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు సుచరిత పర్య వేక్షణలో జరిగిన సమావేశంలో విద్యా ప్రమాణాల పెంపు, ఎఫ్ ఎల్ఎన్, బోధనా పద్ధతులు, ఉపాధ్యాయుల సమయపాలనపై చర్చిం చారు. ఎంఈఓ మహమ్మద్ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ విద్యార్థు లకు నాణ్యమైన విద్య అందించాలని, బోధనాభ్యసన సామగ్రిని విని యోగించాలని సూచించారు. ఆన్‌లైన్ కార్యక్రమాలను గడువులోగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎంఆర్పీలు, ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖేత్ బచావో అభియాన్‌పై రైతులకు అవగాహన



కంగ్టి, నవంబర్ 3 (జనంసాక్షి): తడ్కల్ రైతు వేదికలో ఖేత్ బచావో అభియాన్‌లో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఏఓ హరీష్ పవార్ మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేయాలని, ఎల్‌నినో ప్రభావంతో యాసంగిలో వరికి బదులుగా శనగ, కుసుమ, పొద్దుతిరుగుడు, మినుము వంటి తక్కువ నీటి పంటలు సాగు చేయాలని సూచించారు. సబ్సిడీ శనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రైతులు, ఏఈఓలు పాల్గొన్నారు.

విద్యార్థులకు సరిపడా నాణ్యమైన భోజనము అందించాలని: జిల్లా మైనారిటీ అధికారి ఎంఏ



నారాయణపేట జిల్లా బ్యూరో, నవంబర్ 3 (జనంసాక్షి): విద్యార్థులకు సరిపడా నాణ్యమైన భోజనము అందించాలని జిల్లా మైనారిటీ అధికారి ఎంఏ రషీద్ ఆదేశించారు.

మంగళవారం తెలంగాణ మైనారిటీ రెసిడెన్షి యల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూట్ సొసైటీ బాలుర గురుకుల నారాయణపేట పాఠశాలను జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక ఆదేశాల మేరకు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు రిజిస్టర్ పరిశీలించారు.విద్యార్థులకు అందించే ఆహారం సరుకులు స్టాక్ రిజిస్టర్ ద్వారా ఉన్న స్టాకును తనిఖీ చేసి నాణ్యమైన సరుకులు కొనుగోలు చేయాలని ఆదేశించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనంతోపాటు విద్యను అందించే విధంగా ప్రత్యేక తర గతులు నిర్వహించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం మైనారిటీ విద్యార్థులకు పెద్దపీట వేసిందని వారి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న దని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రియల్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడికి ఘన సన్మానం



రామ్‌రెడ్డిపేట, నవంబర్ 3 (జనంసాక్షి): తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన నిజాంపేట మండలం బాచేపల్లి గ్రామానికి చెందిన పుట్టి సాయిలు ముదిరాజ్‌ను రామ్‌రెడ్డిపేట గ్రామంలో ఘనంగా సన్మానించారు. గ్రామస్తులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ సాయిలు జిల్లా అధ్యక్షుడిగా ఎన్నిక కావడం గ్రామానికి, మండలానికి గర్వకారణ మన్నారు. ఆయన నాయకత్వంలో రియల్టర్ల సమస్యలు పరిష్కా రమై సంఘం బలోపేతం కావాలని ఆకాంక్షించారు. రియల్టర్ల సంక్షేమానికి కృషిచేస్తానని సాయిలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మన్నె కృష్ణ, మాజీ సర్పంచ్ భూమేష్, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ, పంచాయతీ భూముల హద్దులు గుర్తించాలి



చౌట్కూర్, నవంబర్ 3 (జనంసాక్షి): గ్రామ పరిధిలోని ప్రభుత్వ, గ్రామపంచాయతీ భూములను సర్వే చేసి హద్దులు గుర్తించాలని కోరుతూ గ్రామ ప్రజా ప్రతినిధులు, నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సర్వే నంబర్లు 21, 22, 36, 1503, 1632 పరిధిలోని భూముల విస్తీర్ణం, సరిహద్దులు, ప్రస్తుత వినియోగంపై క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించాలని కోరారు. రెవెన్యూ, పంచాయతీ రికార్డులను పరిశీలించి ప్రభుత్వ భూము లను అధికారికంగా నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ఆక్రమణలు, భూ వివాదాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పార్ముల రాంరెడ్డి, జైపాల్ రెడ్డి, అభిలాష్, మంగలి బాలు, మల్లేశం, ఆకుల బాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితున్ని పరామర్శించిన బిజెపి నేత ఎల్లేని సుధాకర్ రావు



పెద్దకొత్తపల్లి, నవంబర్ 3 (జనంసాక్షి): పెద్దకొత్తపల్లి మండలం లోని కల్వకోల్ గ్రామానికి చెందిన జనుపల్లి స్వామి పది రోజుల క్రితం ప్రమాదానికి గురై హైదరాబాద్ దిలుసుకునగర్ లో క్రిటిక హాస్పిటల్లో చికిత్స పొందుతున్న బాధితుడు స్వామిని బిజెపి నేత కొల్లాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఎల్లేని సుధాకర్ రావు పరా మర్శించి బాధితులకి ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.కొల్లాపూర్ నుండి హైదరాబాద్ కు చేప పిల్లలను తీసుకుని వెళుతుండగా అంకిరావుపల్లి బస్ స్టేజి సమీపంలో ప్రమాదం చోటు చేసుకోవడంతో ప్రమాదంలో కాలు విరిగి తీవ్ర గాయాల పాలైన స్వామి చికిత్స పొందుతున్నాడని బిజెవైఎం జిల్లా జర్నల్ సెక్రెటరీ అమ్మపల్లి మల్లేష్ సుధాకర్‌రావుకు తెలిపారు. క్రిటిక ఆసుపత్రి వైద్యులతో ఎల్లేని సుధాకర్ రావు మాట్లాడుతూ జనుపల్లి స్వామి కి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు దేశమోని పరశురాముడు బీజేవైఎం మండల జనరల్ సెక్రెటరీ పెబ్బేటి శివ ప్రమాద బాధితుడు స్వామి కుమారులు రాముడు మల్లేష్ కేశవులకు మనోధైర్యం కల్పిస్తూ త్వరలోనే కోలుకుంటాడని భరోసా కల్పించారు.

గురుకుల విద్యార్థులకు 7 రకాల స్టడీ మెటీరియల్ పంపిణీ





నిజాంపేట్, నవంబర్ 03 (జనంసాక్షి): బాచేపల్లిలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మినీ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులకు గురుకులం ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో 7 రకాల స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఇందులో భాగంగా విద్యార్థులకు షార్పనర్, ఎరేజర్, పెన్నులు, పెన్సిల్ బాక్స్, స్కేల్, డ్రాయింగ్ బుక్, క్రేయాన్స్ తదితర వస్తువులను అందజేశారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కవిత మాట్లాడుతూ... ప్రభుత్వం గురుకుల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తోందని అన్నారు. విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత శిఖరాల ను అధిరోహించాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యా ర్థినులు పాల్గొన్నారు.

కమలాపూర్ చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

- రూ.5 కోట్లతో సుందరీకరణ, అభివృద్ధి పనులు చేపడతాం: ఎమ్మెల్యే సంజీవరెడ్డి



నారాయణఖేడ్, నవంబర్ 3 (జనంసాక్షి): మనూర్ మండలంలోని కమలాపూర్ చెరువును సుందరీకరించి, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన కమలాపూర్ చెరువును పరిశీలించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చెరువు అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.5 కోట్లు మం జూరు చేసిందని తెలిపారు. ఈ నిధులతో చెరు వు పరిసరాలను సుందరీకరించి, పర్యాటకులకు ఆకర్షణీయమైన కేంద్రంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. పర్యాటక అభివృద్ధికి ఈ ప్రాంతం లో విస్తృత అవకాశాలు ఉన్నాయని, చెరువు అభివృద్ధి వల్ల స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్ బాణపురం రాజు, కోఆప్షన్ సభ్యురాలు ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడి ఎన్నిక ఏకగ్రీవం





న్యాల్‌కల్, నవంబర్ 03 (జనంసాక్షి): న్యాల్‌కల్ మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్య క్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశం మేరకు, మం డల ఇంచార్జ్ జయరాజ్ ఆధ్వర్యంలో సోమ వారం సాయంత్రం న్యాల్‌కల్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జహీరాబాద్, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సంఘం శ్రేణులు హాజరై.. మండలంలో మెటల్ కుంట గ్రామానికి చెందిన ఎస్ సంసన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నా రు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా భూచెంద్ర మాదిగ హాజరయ్యారు. త్వరలోనే గ్రామ, విద్యా ర్థి విభాగం కమిటీలను ఏర్పాటు చేయునట్లు నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం శ్రేణులు ఉల్లాస్, వినో ద్, శరణప్ప, సుందర్, ప్రశాంత్, సుక్కప్ప, నిఖి ల్, అభిరామ్, సురేష్, ప్రమోద్, రమేష్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పలు కార్యక్రమాల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



చేర్యాల, నవంబర్ 3 (జనంసాక్షి): మండలంలోని అర్జున్‌పట్ల గ్రామంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంజ మల్లేశం ఆధ్వర్యంలో పార్టీ నాయకులు హాజరై లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయి గృహప్రవేశాలు జరగడం సంతోషకరమన్నారు. రానున్న రోజుల్లో మండలంలోని ప్రతి గ్రామంలోని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించడమే లక్ష్యమని తెలిపారు.



అనంతరం దానంపల్లి మాజీ సర్పంచ్ మాదాసి మల్లేశం తండ్రి మృతిచెందిన విషయం తెలుసుకుని అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మండల అధ్యక్షుడు, సర్పంచ్ కొమ్ము రవి, మాజీ ఎంపీటీసీ తాటికొండ వేణు, ముస్త్యాల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు చేస్తూ కూలీ మృతి



మెదక్, నవంబర్ 3 (జనంసాక్షి): ఉపాధి పనులు చేస్తూ ఓ కూలీ మృతి చెందిన విషాద ఘటన మెదక్ మండలం మక్త భూపతిపూర్ లో చోటుచేసుకుంది. సోమవారం గ్రామానికి చెందిన మద్దగుంట నర్సింలు (56) ఉపాధి హామీ పథకం పనులు చేసేందుకు వెళ్ళాడు. అందరితో కలసి పనిచేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందాడు. పనిచేస్తుండగానే ఆయన అకస్మాత్తుగా కుప్ప కూలడంతో తోటి కూలీలు ఆందోళన కు గురయ్యారు. ఈ ఘటన తో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు

నూతన కార్యదర్శికి ఘన సన్మానం



నిజాంపేట్, నవంబర్ 3 (జనంసాక్షి):
నిజాంపేట్ మండలం ముంగేపల్లి గ్రామపంచాయతీ నూతన కార్యదర్శిగా నియమితులైన నాగమణిని గ్రామస్తులు శాలువాతో ఘనంగా సన్మానించారు.
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంతో పాటు గ్రామ అభివృద్ధికి కృషి చేస్తా నన్నారు. ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, పారదర్శకంగా సేవలందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రేణుక దుర్గాప్రసాద్, ఉపసర్పంచ్ గంగారం, గ్రామ అధ్యక్షుడు జింకల వెంకటేశం, మాజీ ఉపసర్పంచ్, వార్డు సభ్యు డు కిషన్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

సంగారెడ్డి పాలిటెక్నిక్ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్

- 50 మంది విద్యార్థుల హాజరు
- ఉద్యోగంలో చేరిన వారికి ఏడాదికి రూ.2.50 లక్షల వేతన ప్యాకేజీ



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 3 (జనంసాక్షి): సంగారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా చివరి సంవత్సరం విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రముఖ సంస్థ కెర్నెక్స్ మైక్రో సిస్టమ్స్ (ఇండియా) లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉద్యోగ ఎంపికల కార్యక్రమం నిర్వహించారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన 50 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనగా, సంస్థ నిర్వహించిన రాత పరీక్షలో 17 మంది తదుపరి దశకు అర్హత సాధించారు. తుది ఎంపిక ఫలితాలు వెలువడాల్సి ఉంది.ఎంపికైన వారికి శిక్షణ సమయంలో నెలకు రూ.12 వేల ఉపకార వేతనం, శిక్షణ అనంతరం ఉద్యో గంలో చేరిన వారికి ఏడాదికి రూ.2.50 లక్షల వేతన ప్యాకేజీ అందించనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.
ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి. జానకీదేవి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించు కొని ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈ సి ఈ డాక్టర్ చి. విద్యాసాగర్, శిక్షణ, ఉద్యోగ నియామకాల అధికారి శ్రీలక్ష్మి, అధ్యాపకులు ఉమాశంకర్, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కళాశాల నిరంతరం కృషి చేస్తోందని ప్రిన్సిపాల్ తెలిపారు.

త్రాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు...

• ఈ నెల 4 నుండి 6 వరకు గ్రామ సభలు



న్యాల్‌కల్, నవంబర్ 03, (జనంసాక్షి): "ఎల్ నినో".. ప్రభావ నేపథ్యం, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, మండలంలోని ప్రజానీకానికి త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టనున్నట్లు, ఈ మేరకు ఈనెల 4 నుండి 6 వరకు మూడు రోజులపాటు ప్రత్యేకంగా గ్రామ సభలను ఏర్పాటు చేయనున్నట్లు మండల ఇన్చార్జి ఎంపీడీఓ నరేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

గ్రామ సర్పంచ్ అధ్యక్షతన, పంచాయతీ రాజ్, నీటిపారుదల శాఖ, తదితర అధికారుల బృందంతో కలిసి మండలంలోని ప్రతి గ్రామంలో గ్రామ సభలను ఏర్పాటు చేయనున్నారు. గ్రామంలో నీటి సమస్యలను నేరుగా సమీక్షించనున్నారు.

ఈ మేరకు ఈనెల 4న అమీరాబాద్, ఆత్మూర్, బసంతపూర్, చాల్కి, చీకూర్తి, చినిగేపల్లి, డప్పూర్, మూర్తుజాపూర్, గణేష్పూర్, గంగువార్, హదునూర్, హుమ్నాపూర్ గ్రామాల్లో గ్రామ సభలు జరగనున్నాయి.

కరువు అంచనాపై క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారుల పరిశీలన

• తొలిరోజు మూడు గ్రామాల్లో పంటల నష్టంపై వివరాల సేకరణ

న్యాల్‌కల్, నవంబర్ 03, (జనంసాక్షి): ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం న్యాల్‌కల్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించిన నేపథ్యంలో మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, ప్రత్యేక సర్వే బృందం మంగళవారం తొలిరోజు మండలంలోని మెటల్ కుంట, మామిడిగి, హద్నూర్ గ్రామాల శివారుల్లో రైతులు సాగుచేసిన పలు పంటలు నష్టపోయిన వివరాలు, కరువు అంచన వివరాలను సేకరించారు. ప్రస్తుతం తాజాగా సాగు చేసిన పలు పంటల వివరాలను మాత్రమే సర్వే చేపట్టారు.

ప్రత్యేక యాప్ ద్వారా కరువు అంచన సర్వే...

ప్రత్యేక శాఖీయ యాప్ ద్వారానే కరువు అంచన సర్వే చేపట్టారు. వ్యవసాయ శాఖ రూపొందించిన ప్రత్యేక యాప్ ద్వారానే పలు పంటలు నష్ట వివరాల సేకరణ కొనసాగించనున్నారు. మంగళవారం మండల వ్యవసాయ అధికారి అభినాష్ వర్మ పర్యవేక్షణలో ఏఈఓలు, ప్రత్యేక సర్వే బృందం మండలంలోని మూడు గ్రామాల్లో ప్రస్తుతం సాగులో ఉన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు.



అధి కారుల సర్వే బృందానికి మండల రైతాంగం వారి వారి వ్యవసాయ పొలాలు, క్షేత్రస్థాయిలో ఉంటూ.. సర్వే బృందానికి అవసరమైన వివరాలను అందించాలని మండల వ్యవసాయ అధికారి రైతులకు సూచించారు. మండలంలోని ప్రతి గ్రామంలో సర్వే చేపట్టి కరువు అంచన వివరాలను సేకరించనున్నట్లు ఏవో తెలిపారు. అందుకు రైతులు పూర్తిస్థాయిలో సహకారం అందించాలని కోరారు.

రీసర్వే పారదర్శకంగా చేపట్టాలి...

• ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలి: కలెక్టర్ కె.హైమావతి



బెజ్జంకి, నవంబర్ 3(జనంసాక్షి):
మండలంలోని వీరాపూర్ గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే ప్రక్రియ తీరును సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.భూ రీసర్వేలో పూర్తి పారదర్శకత పాటించాలని, ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. సర్వే ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సహకరించాలని, రైతులు సైతం సర్వే బృందాలకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్వో శ్రీకాంత్, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కరువును జాతీయ విపత్తుగా ప్రకటించాలి...

• సిపిఐ జాతీయ కార్యదర్శి పూర్వ శాసనసభ్యులు కే.రామకృష్ణ



మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబర్ 03 (జనంసాక్షి): ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంగా రాష్ట్రంలో కరువు ఏర్పనందున కరువును జాతీయ విపత్తుగా ప్రకటించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పూర్వ శాసనసభ్యులు రామకృష్ణ డిమాండ్ చేశాడు. మంగళవారం రోజు మహబూబ్నగర్ జిల్లాలోని బాల్‌నగర్ మండలం బోడి జానంపేట, రాజాపూర్ మండలంలోని గుడ్ల పోట్లపల్లి, జడ్చర్ల మండలంలోని ఆలూరు గ్రామం, హన్వాడ మండలం దాచక్ పల్లి లలో సిపిఐ జాతీయ కార్యదర్శి, పూర్వ శాసనసభ్యులు కే రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాల నరసింహ జిల్లా కార్యదర్శి బృంగి బాలకృష్ణ సిపిఐ బృందం కలిసి వివిధ గ్రామాలలో కంది వరి, పత్తి పంటలను పరిశీలించి రైతులతో నేరుగా మాట్లాడి వరికి ఎకరాకు 30000 పత్తికి 50000 కరువు నష్టం ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. అదేవిధంగా కరువు దృష్టి విద్యార్థులకు సంబంధించినటువంటి ఫీజులు బకాయిలను కూడా రద్దు చేయాలని ఉపాధి అవకాశాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా పూర్వ కార్యదర్శి పరమేష్ గౌడ్, కార్యవర్గ సభ్యులు కొండపల్లి రాముడు, గోవర్ధన్, కృష్ణ యాదవ్ సురేష్, బాలనరసయ్య, పద్మావతి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు సుంకరి బసవరాజు, ఏఐఎస్ఎఫ్ లక్ష్మణ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు మహేష్ ,సత్యనారాయణ రెడ్డి, శంకర్ నాయక్, ఇన్ సబ్ ఆంజనేయులు, భాషా, ఇందిరా, అంజమ్మ, బాలయ్య, సుందర్రాజు పాల్గొన్నారు.

గోర్ మేళావో-2026 ను విజయవంతం చేయాలి



కొల్చారం, నవంబర్ 3 (జనంసాక్షి): మెదక్ జిల్లా కొల్చారం మండలం వసురాం తండా ఆతిథ్యంలో ఈ నెల 24, 25 తేదీల్లో ఆల్ ఇండియా బంజారా మేళా నిర్వహించనున్నట్లు సర్పంచ్ వినోద్ నాయక్ తెలిపారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ, విదేశాల నుంచి బంజారా ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారని, సుమారు నాలుగు లక్షల మంది పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బంజారా సంస్కృతి, సంప్రదాయాలు, ఐక్యతను చాటిచెప్పడమే మేళా లక్ష్యమన్నారు. మేళాను విజయవంతం చేసేందుకు బంజారా ప్రజలు, సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. సమావేశంలో మోహన్ సింగ్, రామ్ చందర్, జగన్ నాయక్, డి. రాజు, ఎం. మిట్టు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదుకు త్వరపడండి

• యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు రవికుమార్ గౌడ్



నారాయణపేట, నవంబర్ 3(జనంసాక్షి): త్వరలో జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదుకు నవంబర్ 6 తేదీ వరకు గడువు ఉన్నట్లు యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు రవికుమార్ గౌడ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులు సంబంధిత విద్యార్హత పత్రాలతో ఓటర్ గా నమోదు చేసుకోవాల న్నారు.మహబూబ్నగర్–రంగారెడ్డి– హైదరాబాద్ పట్ట భద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా సామ రామ్మోహన్ కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలో ఉన్నా డన్నారు. కాంగ్రెస్ ప్రభు త్వం ఆయా రంగాల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు జాబ్ నోటిఫికేషన్లు విడు దల చేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తుందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్నికల హామీలను క్రమంగా అమ లు చేస్తుందన్నారు. పట్ట భద్రులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఓటు వేసి గెలి పించాలని కోరారు. ప్రజా స్వామ్యంలో ఓటు వజ్రా యుధం లాంటిదని ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకొని తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగిం చుకోవాలన్నారు.

పెద్దకొత్తపల్లి ఎంఈఓగా ఖాజా జియావుద్దీన్



పెద్దకొత్తపల్లి, నవంబర్ 3 (జనంసాక్షి): పెద్దకొత్తపల్లి మండలం నూతన విద్యాధికారిగా పెద్ద కార్పాముల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు ఖాజా జియావుద్దీన్ మంగళవారం విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంఈఓ (కల్వకోల్ ప్రధానోపాధ్య యురాలు) ఉమాదేవి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎం.భారతి బి.లక్ష్మణ్ ఉపాధ్యాయులు బి శివుడు రాంపాల్ సుదర్శన్ ఎమ్మార్సీ సిబ్బంది శివలింగం స్వామి సిఆర్పి ఈశ్వర్ ఐఆర్పి నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే సకల సంపదలు.. సమాజంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలి

• విద్యార్థులకు వివేకానంద స్వామి జీవిత చరిత్ర పుస్తకాల పంపిణీ..

• గాధిర్యాల్ గ్రామాభివృద్ధికి ఎంపీ నిధులతో సహకరిస్తా: బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ వెన్న ఈశ్వరప్ప

మహమ్మదాబాద్, నవంబర్ 03 (జనంసాక్షి):
విద్య ద్వారానే వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజ ప్రగతి సాధ్యమని,ప్రతిఒక్కరూ విద్యకు ప్రాధాన్యతనిస్తూ క్రమశిక్షణతో చదువుకోవాలని సేవారత్న అవార్డు గ్రహీత,బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ వెన్న ఈశ్వరప్ప అన్నారు.మంగళవారం మహమ్మదాబాద్ మండలంలోని గాధిర్యాల్ గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు స్వామి వివేకానంద జీవిత చరిత్ర,సూక్తులతో కూడిన పుస్తకాలను పంపిణీ చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు సూచించిన మార్గంలో నడుస్తూ విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని,ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని కష్టపడి చదివి సమాజంలో మంచి గుర్తింపు పొందాలని సూచించారు.స్వామి వివేకానంద ఆశయాలు,ఆదర్శాలను విద్యార్థులు జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు.అనంతరం పాఠశాలలో తాగునీటి సమస్యను ప్రధానోపాధ్యాయులు రాములు, గ్రామ సర్పంచ్ మాణిక్యమ్మ ఆయన దృష్టికి తీసుకెళ్లగా,విద్యార్థుల సౌకర్యార్థం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయిస్తానని డాక్టర్ వెన్న ఈశ్వరప్ప హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధికి బీజేపీ నాయకుల సహకారం





గాదిరాళ్ గ్రామ అభివృద్ధికి సహకరించాలని గ్రామ సర్పంచ్ మాణిక్యమ్మ,బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ వెన్న ఈశ్వరప్పను కోరారు.గ్రామంలో సీసీ రోడ్లు,హైమాస్ట్ లైట్లు,తాగునీటి సమస్య పరిష్కారానికి నూతన బోరు, శిథిలావస్థకు చేరిన బీసీ కమ్యూనిటీ హాల్ స్థానంలో నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన డాక్టర్ వెన్న ఈశ్వరప్ప గ్రామంలోని బీసీ కమ్యూనిటీ హాల్‌తో పాటు బొగుడ మీద ఉన్న రోడ్డును పరిశీలించారు. గ్రామ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లి ఎంపీ నిధుల ద్వారా కమ్యూనిటీ హాల్,సీసీ రోడ్లు,హైమాస్ట్ లైట్లు,తాగునీటి అవసరాలకు నూతన బోరు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ పథకాలు,ఎంపీ నిధులను సద్వినియోగం చేసుకునేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాణిక్యమ్మ, బీజేపీ మండల అధ్యక్షుడు మూస నరసింహ,జిల్లా కౌన్సిల్ మెంబర్ కురువ కృష్ణ, బీజేవైఎం గండీడ్ మండల అధ్యక్షుడు చిట్యాల యాదగిరి, బీజేపీ నాయకులు ప్రభు నాయక్, ముచ్చర్ల సురేష్, బద్రిశ్వర్, శివ,తదితరులు పాల్గొన్నారు.

డంప్‌యార్డు నిర్వహణ లోపాలపై ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆగ్రహం

- **దీపావళిలోపు సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఆదేశం**

సదాశివపేట, నవంబర్ 3 (జనంసాక్షి): ఎన్కెపల్లి డంప్ యార్డు నిర్వహణలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులతో కలిసి ఎన్కేపల్లి డంప్‌యార్డును మంగళవారం సందర్శించి గ్రామస్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దీపావళి పండుగలోపు సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. డంప్ యార్డు నుంచి చెత్త రోడ్లపైకి చేరడంతో పాటు కుక్కలు, పందులు, పశువుల సంచారం పెరిగి ప్రజలు, విద్యార్థులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. చెత్తను రోడ్లపై వేయకుండా డంప్‌యార్డులోనే నిల్వచేయాలని సూచించారు. కలుషిత వర్షపు నీరు సమీపంలోని రెండు చెరువుల్లో చేరడంతో మత్స్యకారులు నష్టపోతున్నారని, భూగర్భ జలాలు సైతం కలుషితమవుతున్నాయని తెలిపారు. కలుషిత జలాలు చెరువుల్లోకి చేరకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్న ఎంకేపల్లి చౌరస్తాలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు.





ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధీర్ రెడ్డి, కోడూరి రమేష్, మాజీ వైస్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి, ఆత్మకూరు అమరేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు పెద్ద గొల్ల ఆంజనేయులు, మాజీ సర్పంచులు రాములు, శేఖర్, గ్రామ యువత, గ్రామ పెద్దలు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులపై పోలీసుల దాడులు కేసులు నమోదు

మల్దకల్, నవంబర్ 3 (జనంసాక్షి): జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం పెద్దపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి బెల్ట్ షాపులు, నిట్టింగ్‌లపై పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఎస్సై కొండా శ్రీహరి ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో ఉలవ తిమ్మప్ప, బండి శీను వద్ద నిల్వ ఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు ఇద్దరు పై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. రోడ్డు వెంబడి విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు కొనసాగడంతో దీనివల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.



అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్ పట్టివేత

తెలకపల్లి, నవంబర్ 3 (జనంసాక్షి): అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఎస్సై ఎం. రమేష్ తెలిపిన వివరాల ప్రకారం దుందుభి వాగు నుంచి మండల కేంద్రానికి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ట్రాక్టర్ నంబర్ టీఎస్ 31 టీ 8977 కాగా, డ్రైవర్ రాము నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దముదురు గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ట్రాక్టర్‌ను తహసీల్దార్‌కు అప్పగించి జరిమానా విధించేందుకు చర్యలు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



బియ్యం కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

- **కిలో ధర వివరాలతో కూడిన పట్టికలను ఏర్పాటు చేయాలి**
- **బియ్యం నిల్వలు, ధరలపై అధికారుల సమీక్ష**

సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 3 (జనంసాక్షి): బియ్యం కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ (పౌర సరఫరాల) వ్యాపారులకు హెచ్చరించారు.

జిల్లాలో బియ్యం లభ్యత, ప్రస్తుత నిల్వలు, మార్కెట్ ధరలు, సరఫరా పరిస్థితిపై బియ్యం టోకు, చిల్లర వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల బియ్యం నిల్వలు, ధరలను సమీక్షించారు. వినియోగదారులకు నిరంతరాయంగా బియ్యం సరఫరా జరిగేలా వ్యాపారులు తగినంత నిల్వలు అందుబాటులో ఉంచుకోవాలని, న్యాయమైన ధరలకే విక్రయించాలని అదనపు కలెక్టర్ సూచించారు.

మార్కెట్లో కృత్రిమ కొరత సృష్టించడం, అధికంగా నిల్వలు చేయడం, అధిక ధరలకు విక్రయించడం వంటి అక్రమాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారులు తమ దుకాణాల్లో బియ్యం రకం, నిల్వల పరిమాణం, కిలోధర వివరాలతో కూడిన పట్టికలను తప్పని సరిగా ఏర్పాటు చేయాలని, వాటిని ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు. నిల్వలు, విక్రయాలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వివాదాలు ఆపండి

- **దేవాలయ కమిటీ సభ్యులు రాంరెడ్డి విజ్ఞప్తి**



జడ్చర్ల, నవంబర్ 3 (జనంసాక్షి):

జడ్చర్ల పెద్దగుట్ట శ్రీ రంగనాయకస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనపై తలెత్తుతున్న అనవసర వివాదాలకు స్వస్తి పలకాలని దేవాలయ కమిటీ సభ్యులు రాంరెడ్డి మంగళవారం కోరారు. పవిత్రమైన ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని అనవసర వివాదాలకు వేదిక చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. చిన్నజీయర్ స్వామి శిష్యులు కేశవాచార్యులు ఆడియోలో స్పష్టం చేసినట్లుగా, ప్రతిష్ఠాపన ముహూర్త సమయాన్ని తామే వాట్సాప్ ద్వారా పంపిన విషయాన్ని అందరూ గుర్తించాలని పేర్కొన్నారు. ఒక్కోసారి ధ్వజస్తంభమే వద్దని, మరోసారి చెక్క ధ్వజస్తంభమే కావాలని, ముహూర్తం సరిగా లేదని పదేపదే అభ్యంతరాలు వ్యక్తం చేయడం వల్ల భక్తుల్లో గందరగోళం నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందేహాలపై సంబంధిత అధికారులు, పండితులు ఆగమశాస్త్ర ఆధారాలతో స్పష్టతనిచ్చి, వివాదాలకు అతీతంగా రంగనాయకస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

కంది కేంద్ర కారాగారంలో ఖైదీల సమస్యలపై ఆరా...

- **ఖైదీలకు అందుతున్న సౌకర్యాలు, న్యాయ సహాయంపై పరిశీలన**
- **జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య**

సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 3 (జనంసాక్షి):

సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య కంది కేంద్ర కారాగారాన్ని సందర్శించి ఖైదీలకు అందుతున్న సౌకర్యాలు, న్యాయ సహాయం, వారి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా జైలులోని వివిధ విభాగాలను సందర్శించి ఖైదీలతో నేరుగా మాట్లాడారు. వారికి అందుతున్న ఆహారం, వైద్య సదుపాయాలు, పారిశుద్ధ్యం, తాగునీటి సౌకర్యాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందని, న్యాయపరమైన సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామని భరోసా ఇచ్చారు. విడుదల అనంతరం సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా జీవించేలా ఖైదీలకు చట్టంపై అవగాహన, తగిన మార్గదర్శకత్వం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారులు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



తారా కళాశాలలో సహజ సౌందర్య ఉత్పత్తుల తయారీపై అవగాహన

- **విద్యార్థులకు హెర్బల్ ఉత్పత్తుల తయారీలో శిక్షణ**

సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 3 (జనంసాక్షి):

తారా ప్రభుత్వ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో అంతర్గత నాణ్యతా ప్రమాణాల విభాగం ఆధ్వర్యంలో ఎఫ్ఐసీసీఐ మహిళా సంస్థ (ఎఫ్ఎల్ఓ) హైదరాబాద్ సహకారంతో సహజసిద్ధమైన సౌందర్య ఉత్పత్తుల తయారీపై అవగాహన, ప్రాయోగిక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎఫ్ఎల్ఓ చైర్‌పర్సన్ సీతా రంజిత్ రెడ్డి హాజరయ్యారు. వనరుల వ్యక్తి సుధా మూలా, హెచ్.ఆర్. కల్పన సహజ పదార్థాలతో ఇంట్లోనే సబ్బులు, క్రీములు, శరీర సౌందర్యానికి ఉపయోగించే లేపనాలు, ఇతర ఉత్పత్తులను తయారుచేసే విధానాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించి విద్యార్థులకు వివరించారు. రసాయన పదార్థాలకు ప్రత్యామ్నాయంగా సహజసిద్ధమైన పదార్థాలను ఎలా వినియోగించుకోవాలో ప్రాయోగికంగా తెలియజేశారు. అనంతరం గత నెలలో ఎఫ్ఎల్ఓ సహకారంతో కళాశాల బీకాం విద్యార్థులకు నిర్వహించిన ట్యాలీ ప్రో శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు ముఖ్య అతిథి ధ్రువపత్రాలను అందజేశారు.

ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సుచిత్ర సింగ్, డాక్టర్ కె. సుజాత, అంతర్గత నాణ్యతా ప్రమాణాల విభాగం సమన్వయకర్త డాక్టర్ కె. వాణి, ట్యాలీ కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ ఆర్. కరుణతో పాటు పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.







ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ..

ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకత, స్వయం ఉపాధి నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు సహజ ఉత్పత్తుల తయారీపై అవగాహన కల్పిస్తాయని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ తెలిపారు. భవిష్యత్తులోనూ విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

తిర్మలాపూర్‌లో టీఆర్ఎస్‌లో పలువురు చేరిక...

నారాయణపేట నవంబర్ 3 (జనంసాక్షి):

తెలంగాణ రక్షణ సేన పార్టీకి రోజురోజుకూ ప్రజాదరణ పెరుగుతోందని, పార్టీలోకి వివిధ గ్రామాల నుంచి ప్రజలుస్వచ్ఛందంగా చేరుతున్నారని తెలంగాణ రక్షణ సేన నారాయణపేట జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం నారాయణపేట మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన పలు వురు గ్రామస్తులు మాజీ వార్డు మెంబర్లు చుక్క దస్తప్ప, వెలుగు బలప్ప, కోమటి వీరేష్ ఆధ్వర్యంలో తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా గుంటు గారి కృష్ణయ్య, జి. నాగేష్, కమంగారి బాలకృష్ణ, చుక్క గోపాల్, కోరేమోని గోవిందు, కే.బాలరాజు, జోగు శివప్ప, సింగారం కానుకప్ప, దూల్లా గోవిందు, దూల్లా మల్లప్ప తదిత రులు పార్టీలో చేరారు.

పార్టీలో చేరిన వారికి తెలం గాణ రక్షణ సేన నారాయణపేట జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలకు ఆకర్షితులై మరింత మంది పార్టీలో చేరడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దామరగిద్ద మండల పార్టీ అధ్యక్షులు నర్సింహారెడ్డి, బండగొండ రాజు, కోటకొండ రాజు తదితరులు పాల్గొన్నారు.



బీరు పరిశ్రమకి మంజీరా జలాల అక్రమ తరలింపు

- **శివంపేట గ్రామానికి తాగునీటికి తిప్పలు.. బీరు పరిశ్రమకు నీటి సరఫరా**
- **సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వినతి**



చౌట్కూర్, నవంబర్ 3 (జనంసాక్షి): గ్రామ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు శివంపేట గ్రామంలో తీవ్ర అసంతృప్తికి దారితీస్తున్నాయి. గ్రామంలో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటుంటే, మరోవైపు సమీపంలోని బీరు పరిశ్రమకు లక్షల లీటర్ల మంజీరా జలాలను తరలిస్తున్నారంటూ గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు సరిపడా నీరు అందించలేని పరిస్థితుల్లో పరిశ్రమలకు భారీగా నీటిని ఎలా సరఫరా చేస్తున్నారని అధికారులను నిలదీస్తున్నారు. సంబంధిత అధికారులకు వినతిపత్రం సమర్పించి తమ సమస్యలను వివరించినట్లు గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో గ్రామ పరిధిలోని పరిశ్రమకు మంజీరా నది నుంచి భారీ మొత్తంలో నీటిని తరలిస్తుండడం ఒకవైపు గ్రామ ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతుంటే, మరోవైపు పరిశ్రమ అవసరాలకు లక్షల లీటర్ల నీటిని వినియోగించడం ఎంత వరకు సమంజసమని ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ ఈ పరిశ్రమకి నీటి అనుమతి ఆంక్షలు ఏమైనా ఉన్నాయా లేదా ఎంతవరకు ఉంది అని ప్రశ్నిస్తున్నారు. ముందుగా గ్రామ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చిన తర్వాతే ఇతర అవసరాలకు వినియోగంపై అధికారులు ఆలోచించాలన్నారు. ప్రజల జీవన అవసరాలను పక్కన పెట్టి పరిశ్రమల అవసరాలకే ప్రాధాన్యత ఇస్తే గ్రామస్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, ఈ విషయంలో ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. స్పందించకపోతే గ్రామ ప్రజలను సమీకరించి ప్రజా ఉద్యమానికి సిద్ధమవుతామని శివంపేట గ్రామ ప్రజల నీటి హక్కులను కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఇద్దరు బాలికలు ఎంపిక

- **నేడు హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు**





న్యాల్‌కల్, నవంబర్ 03 (జనంసాక్షి): జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో సత్తా చాటి తాజాగా మరో ఇద్దరు బాలికలు రాష్ట్ర కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. అండర్ 14 విభాగంలో నిర్వహించిన పోటీల్లో ఇటీవల ఇద్దరు బాలికలు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక అవ్వగా.. సోమవారం రాత్రి జరిగిన పోటీల్లో మరో ఇద్దరు బాలికలు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. విద్యతో పాటు పలు క్రీడా పోటీల్లో మెరుగైన ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో.. రాష్ట్ర ప్రభుత్వం మండల, జిల్లా స్థాయిలో పలు క్రీడా పోటీలను కొనసాగిస్తోంది. ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు.. మండల స్థాయిలో పలు పోటీలను కొనసాగించింది. తాజాగా సోమవారం ఉదయం సంగారెడ్డి లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రాంగణంలో ఉదయం నుండి రాత్రి వరకు పలు పోటీలను నిర్వహించారు. జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీల్లో.. న్యాల్ కల్ కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలకు చెందిన బాలికలు కబడ్డీ పోటీలో తలపడ్డారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన కబడ్డీ క్రీడాకారులతో పోటీ పడ్డారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీలో కస్తూర్బా గురుకులానికి చెందిన బాలికలు రెండవ స్థానాన్ని పొందారు. జిల్లాస్థాయిలో విజయం సాధించి.. ఇద్దరు బాలికలు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. కస్తూర్బా గురుకులానికి చెందిన ఏడవ తరగతి విద్యార్థిని సావిత్రి, 9వ తరగతి విద్యార్థిని పూజ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని పవిత్రలు విజయం సాధించారు. ఈనెల 2 సోమవారం రాత్రి వరకు తాజాగా జరిగిన కబడ్డీ పోటీల్లో.. ఇంటర్ బైపీసీకి చెందిన మొదటి సంవత్సరం విద్యార్థినీలు ఎం.మీరాభాయి, జె.సౌమ్యలు విజయం సాధించారు. అండర్ 14 విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎంపికైన మరో ఇద్దరు బాలికలు ఈ నెల 4, మంగళవారం హైదరాబాదులో నిర్వహించే కబడ్డీ పోటీలో తలపడనున్నారు. జిల్లాస్థాయిలో రెండవ స్థానం, రాష్ట్ర స్థాయిలో 4 బాలికలు ఎంపిక కావడం పట్ల పీఈటి భూమిక, కస్తూర్బా పాఠశాలల ఉపాధ్యాయ సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు.

ప్రభుత్వం సూచించిన ధరలకే బియ్యం విక్రయించాలి...

- **అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు**
- **జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానంద్**



మెదక్ బ్యూరో, నవంబర్ 3 (జనంసాక్షి): ప్రభుత్వం సూచించిన ధరలకే బియ్యం విక్రయించాలని అధిక ధరలకు విక్రయిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద్ తెలిపారు. మంగళవారం కమిషనర్, పౌర సరఫరాల శాఖ వారి ఆదేశాల మేరకు, మెదక్ పట్టణంలోని ఆర్వీదీప్ సూపర్ మార్కెట్, జి.వి. సూపర్ మార్కెట్‌తో పాటు ఇతర బియ్యం విక్రయ దుకాణాలలో మెదక్ జిల్లా పౌర సరఫరాల అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సందర్భంగా జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానంద మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన ధరలకే బియ్యం విక్రయించాలని సంబంధిత వ్యాపారులకు అధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసామన్నారు.

ప్రభుత్వం సూచించిన గరిష్ట విక్రయ ధరలు
- **బీపీటీ/కెఎన్ ఎం బియ్యం:** కిలోకు రూ. 66/-
- **ఆర్ఎన్ఆర్ / తెలంగాణ సోనా బియ్యం:** కిలోకు రూ. 74/-
- **హెచ్ఎంటి / జైశ్రీరామ్ బియ్యం:** కిలోకు రూ. 79/-

ధరలకు మించి బియ్యం విక్రయించరాదని వ్యాపారులను హెచ్చరించారు. ప్రభుత్వం సూచించిన ధరలను తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలను ఉల్లంఘించి అధిక ధరలకు బియ్యం విక్రయించినట్లు గుర్తిస్తే సంబంధిత వ్యాపారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ఈ తనిఖీలలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీ పి. నిత్యానందం, అసిస్టెంట్ పౌర సరఫరాల అధికారి శ్రీ ఎం.డి. అబ్దుల్ నిస్సార్, పౌర సరఫరాల శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీ తాటి నర్సింలు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వెల్దండలో కస్తూర్బా పాఠశాలలో మురుగునీటి సమస్య పరిశీలన

- **గ్రామ సర్పంచ్ - మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్**



వెల్దండ, నవంబర్ 03 (జనంసాక్షి): మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ఆవరణలో నిలిచిన మురుగునీటి సమస్యను గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ ఆధ్వర్యంలోలి మంగళవారం పరిశీలించడం జరిగింది.పాఠశాల ముందున్న డ్రైనేజీ ముందుకు వెళ్లకపోవడంతో మురుగునీరు పాఠశాల ఆవరణలోకి ప్రవహిస్తోందని, దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రిన్సిపాల్ స్రవంతి తెలిపారు. దోమలు పెరిగి అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.సమీపంలోని పంట పొలాలకు మురుగునీరు చేరకుండా రైతులు అడ్డుకట్ట వేయడంతో ఈ పరిస్థితి తలెత్తింది.ఈ సందర్భంగా సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ మాట్లాడుతూ... విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత దృష్ట్యా పంట పొలాలకు మురుగునీరు వెళ్లకుండా అంతర్గత కాలువలు నిర్మించి శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.
ఈ పరిశీలన కార్యక్రమంలో ఎంపీడీవో సులోచన, ఎంపీఓ లింగయ్య, పంచాయతీ కార్యదర్శి గిరి, వార్డు సభ్యులు కిష్టల్, వెంకటేష్, నాయకులు మారపల్లి మంజుల శ్రీను, రషీద్, మట్ట భరత్ గౌడ్, కొండల్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెలంగాణ రక్షణ సేన మల్దకల్ మండల కార్యవర్గం ఎన్నిక



మల్దకల్, నవంబర్ 3 (జనంసాక్షి): గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి గొంగళ్ల రంజిత్ కుమార్, జిల్లా అధ్యక్షుడు బుచ్చిబాబు యాదవ్ ఆధ్వర్యంలో తెలంగాణ రక్షణ సేన మల్దకల్ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బి.విష్ణు, ప్రధాన కార్యదర్శిగా గోపాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆంజనేయులు, మీడియా ఇన్‌చార్జిగా మున్నాఫ్ ఎన్నికయ్యారు. జాయింట్ సెక్రటరీలు, అధికార ప్రతినిధులు, సలహాదారులు, కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు. నూతన కమిటీ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని రంజిత్ కుమార్ సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సా కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు



రాజాపూర్, నవంబర్ 3 (జనంసాక్షి): మంగళవారం రంగారెడ్డి గూడా లోని రెండు ప్రథమ చికిత్సా కేంద్రాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏ శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేసి బంద్ చేయడం జరిగింది. డిఎంహెచ్ఓ ప్రథమ చికిత్సా కేంద్రాలను తనిఖీ చేసినా సందర్భంలో హై యాంటీబయాటిక్స్ మరియు ఫ్లూయిడ్స్ మరియు అనుమతి లేకుండా మందుల నిలువలను కనుగొనడం జరిగిందని, అదేవిధంగా వాడిన సిరంజీలు,సెలైన్ బాటిల్స్ ను రోజుల తరబడి నిల్వ ఉంచడం జరిగిందని, వీటిని సైంటిఫిక్ లో డిస్పోజల్ చేయాల్సి ఉందని ,లేనిచో ప్రజల ఆరోగ్యానికి హానికరంగా మారి ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని, పై తెలిపిన ఉల్లంఘనల కారణంగా అట్టి రెండు ప్రథమ చికిత్సా కేంద్రాలను మూసి వేయడం జరిగిందని తెలిపారు.కార్యక్రమంలో డాక్టర్ శివకాంత్ నోడల అధికారి, హనుమంతు హెల్త్ ఎడుకేటర్, సిద్దిక్ పాల్గొన్నారు.

నూతన తహసీల్దార్‌కు ఘన సన్మానం



ఉప్పునుంతల, నవంబర్ 3 (జనంసాక్షి): మండల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన మల్లెల స్వప్నను సీఎం ప్రవాసి ప్రజావాణి రాష్ట్ర కోఆర్డినేటర్ బొజ్జ అమరేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ రైతులు, సామాన్యుల రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ జిల్లెల జగత్ రెడ్డి, దెంది భాస్కర్ రెడ్డి, మోకురాల శేఖర్ గౌడ్, కేశమోని శేఖర్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రమేష్ నాయక్, ఆర్ఐ బలరాం పాల్గొన్నారు.

నంగునూరు మండల డీవైఎఫ్ఐ కన్వీనర్‌గా తాళ్లపల్లి ప్రణయ్



నంగునూరు, నవంబరు 3 (జనంసాక్షి): భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య నంగునూరు మండల సమన్వయకర్తగా రాజగోపాల పేట గ్రామానికి చెందిన తాళ్లపల్లి ప్రణయ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆ సంస్థ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ వెల్లడించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో దాసరి ప్రశాంత్ మాట్లాడుతూ.. మండలంలోని యువత, నిరుద్యోగ విద్యార్థులు ఎదుర్కొంటున్న ఉద్యోగ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలను మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఎంతోమంది యువకులు చదువులు పూర్తి చేసుకున్నప్పటికీ తగిన ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం మండలంలో పరిశ్రమలు, ప్రైవేటు సంస్థలను ఏర్పాటు చేయాలని కోరారు. ఏర్పాటు చేసే పరిశ్రమలు, సంస్థల్లో స్థానిక యువతకు ప్రాధాన్యత కల్పించి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. డీవైఎఫ్ఐ నూతన మండల కన్వీనర్‌గా ఎన్నికైన తాళ్ళపల్లి ప్రణయ్ మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, నిరుద్యోగ సమస్యల పరిష్కారం, విద్యార్థుల హక్కుల సాధన కోసం యువజన సమాఖ్య ఆధ్వర్యంలో నిరంతరం పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు.

అయిజ అభివృద్ధి పనులకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం

అయిజ, నవంబర్ 03 (జనంసాక్షి): అయిజ మున్సిపాలిటీ చైర్మన్ సీఎం సురేష్ అధ్యక్షతన అయిజ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం. 49 అంశాలకు ఆమోదం, రూ.20 కోట్ల తాగునీటి పథకానికి ప్రతిపాదనలు.. పట్టణ అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం. అయిజ పుర పాలక సంఘం కౌన్సిల్ సాధారణ సమావేశం మంగళ వారం మున్సిపల్ చైర్మన్ సీఎం సురేష్ అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమా వేశంలో మొత్తం 51 అంశాలను ప్రవేశపెట్టగా, 39, 45వ అంశాలను తిరస్కరించి మిగిలిన 49 అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

చైర్మన్ సీఎం సురేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం లో పట్టణంలోని వివిధ వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి పైప్‌లైన్లు, వీధి దీపాలు, రోడ్ల మరమ్మతులు తదితర అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదన లకు ఆమోదం లభించింది.



ముఖ్యంగా వేసవిలో తాగు నీటి ఎద్దడి నివారణకు రూ.20 లక్షలు, డంపింగ్ యార్డులో సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్‌కు విద్యు త్ సదుపాయం కల్పించేం దుకు రూ.25 లక్షల ప్రతి పాదనలకు ఆమోదం తెలి పారు.

అదేవిధంగా రాజోలి వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నుంచి అయిజ, వడ్డేపల్లి మున్సిపాలిటీలకు తాగునీటి సరఫరా మెరుగుపరిచేందుకు రూ.20 కోట్లతో రూపొందించిన వాటర్ సప్లై ఇంప్రూవ్‌మెంట్ స్కీమ్‌కు ప్రభుత్వ పాలనా అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

అలాగే శిథిలావస్థలో ఉన్న తాగునీటి ట్యాంకుల తొలగింపు, అంగన్‌వాడీ కేంద్రాలకు తాగునీటి సదుపాయం, వీధి కుక్కల నియంత్రణ, పారిశుద్ధ్య నిర్వహణ, రోడ్ల భద్రత తదితర అంశాలపై కూడా నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్, వైస్ చైర్మన్ మాల నరసింహులు, వార్డు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ మోడ్రన్ రైస్ మిల్లులో అధికారుల తనిఖీలు



మల్దకల్, నవంబర్ 3 (జనంసాక్షి): మండల కేంద్రంలోని బాలాజీ మోడ్రన్ రైస్ మిల్లును జిల్లా సివిల్ సప్లై అధికారి స్వామికుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు రాజేష్, ప్రశాంత్ గౌడ్ తనిఖీ చేశారు. కుర్తిరావులచెరువు సమీపంలోని గోదాం లో నిల్వ ఉంచిన సీఎంఆర్ ధాన్యాన్ని పరిశీలించారు. జిల్లా లో రైస్ మిల్లులపై విజిలెన్స్ తనిఖీలు కొనసాగుతున్న నేపథ్యంలో అధికారులు ఈ తనిఖీలు చేపట్టారు. జిల్లాకు 42 వేల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ధాన్యం కేటాయించినట్లు తెలిపారు. ధాన్యం నిల్వల్లో అవకతవకలు, అక్రమాలకు పాల్పడితే ఎంతటివారైనా కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని స్వామికుమార్ హెచ్చరించారు. మద్దెలబండ లోని రైస్ మిల్లుల్లోనూ తనిఖీలు చేపడతామని అధికారులు తెలిపారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం చేసిన మాజీ జెడ్పిటిసి

కొండపాక, అక్టోబర్, 3 (జనంసాక్షి): కొండపాక మండలం దిమ్మక్కపల్లి గ్రామానికి చెందిన చిలుముల రామయ్య అనారోగ్యంతో మృతి చెందారు.ఈవిషయం తెలుసుకున్న కొండపాక మండల తాజా మాజీ జెడ్పిటిసి అనంతుల అశ్విని- ప్రశాంత్ గారు 5000/- రూపాయలు ఆర్థిక సాయం ఆ కుటుంబానికి స్థానిక బిఆర్ఎస్ నాయకుల చేత అందజేయడం జరిగిందని రాంప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ కూటమి ఘన విజయం..సురేందర్ రెడ్డి హర్షం



ఉప్పునుంతల,(జనంసాక్షి): ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నిక ల్లో ఎన్డీఏ కూటమి ఘన విజ యం సాధించడంపై బీజేపీ కిసా న్ మోర్చా జిల్లా కార్యదర్శి ఏల సురేందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బ్యాలెట్ పేపర్ ద్వారా జరిగిన ఎన్నికల్లో ప్రజలు ఎన్డీఏ కూటమికి పట్టం కట్టడం ప్రజాస్వామ్య విజయమని అన్నారు. ప్రతిపక్షాల ఓటు చోరీ ఆరోపణలకు ప్రజల తీర్పు తగిన సమాధానమని పేర్కొన్నారు. ఎన్డీఏ కూటమికి ఘన విజయం అందించిన ఓటర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

లాంగ్ మెమో ఇవ్వడం లేదని తల్లిదండ్రుల ఆవేదన



గద్వాల, నవంబర్ 3 (జనంసాక్షి): పదో తరగతి పూర్తి చేసిన తమ కుమార్తెకు లాంగ్ మెమో జారీ చేయకుండా ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం ఇబ్బందులకు గురిచేస్తోందని తల్లి దండ్రులు ఆరోపించారు. ఫీజులన్నీ చెల్లించినప్పటికీ మెమో ఇవ్వకపోవడంతో పై చదువుల ప్రవేశాలకు దరఖాస్తు చేసు కోలేకపోతున్నామని విద్యార్థిని ఆవేదన వ్యక్తం చేసింది. పాఠశాల చుట్టూ తిరిగినా సరైన సమాధానం రావడం లేదని తల్లిదండ్రులు వాపోయారు. కలెక్టర్, విద్యాశాఖ అధికారులు స్పందించి విచారణ జరిపి వెంటనే మెమో ఇప్పించాలని కోరారు. బాధ్యులైన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, న్యాయం జరగకపోతే కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడ తామని హెచ్చరించారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి వినియోగదారుల దినోత్సవం



రాజాపూర్, నవంబర్ 3 (జనంసాక్షి): విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ వినియోగదారుల ఫోరం ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని రాజాపూర్ మండల కేంద్రంలో విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయంలో నిర్వహించినట్లు ఏడీఈ నవీన్ కూమార్ తెలిపారు. విద్యుత్ మీటర్లు, విద్యుత్ సరఫరాలో అంత రాయం, విద్యుత్ లైన్ల ఏర్పాటు, వ్యవసాయానికి సంబంధిం చిన ట్రాన్స్ ఫార్మర్‌ల ఏర్పాటుకు ఈ విద్యుత్ వినియోగ దారుల ఫోరం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని విద్యు త్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజాపూర్ ఏఈ వెంకటేష్, బాలానగర్ ఏఈ చంద్రశేఖర్, నావాబ్ పేట్ ఏఈ అఖిల్ , సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలకు మంచి ఆయుధము చదివే



మల్దకల్, నవంబర్ 3 (జనంసాక్షి):
మండల కేంద్రంలోనిపియం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో బాలికా, శిశు సాధికారత భద్రత క్లబ్ ఏర్పాటులో భాగంగా మంగళవారం కార్యక్రమం ఏర్పాటు చేశారు. మణెమ్మ,గీత ఆధ్వర్యంలో ఎస్సై శ్రీహరి సహకారముతో మహిళా కానిస్టేబుల్ మౌనిక, కానిస్టేబుల్స్ ఇస్మాయిల్ తిప్పారెడ్డి, సుధాకర్‌తో బాలికల భద్రతపై ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి వక్తగా విచ్చేసిన మహిళా కానిస్టేబుల్ మౌనిక బాలికల భద్రతపై అన్ని అంశములు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ ,ఉమెన్ ట్రాఫికింగ్ బాల కార్మిక వ్యవస్థ బాల్య వివాహాలు వంటి అన్ని అంశములను విద్యార్థులకు వివరంగావివరించి సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్నటువంటి అన్ని సవాళ్లను అధిగమించేందుకు మంచి ఆయుధం చదివేనని , చదువుని నిర్లక్ష్యం చేయకుండా కష్టపడి ఇష్టంతో చదివి మంచి స్థాయికి ఎదిగి పదిమందికి సహాయపడే స్థాయికి ఎదగాలని వివరించారు. ప్రధానోపాధ్యాయులు సురేష్ మాట్లాడుతూ ఆడపిల్లలుచదువుకోవడానికి అన్ని అవకాశాలు ప్రభుత్వం కల్పిస్తుందని వాటిని వినియోగించుకొని మంచి స్థాయికి ఎదగాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఇన్చార్జి హెడ్మాస్టర్ రాజేశ్వర్ రెడ్డి,సుజాత,భాస్కర్,శుభ,వరలక్ష్మి రమణమ్మ,సుహాసిని పాల్గొన్నారు.

లండన్‌లో తెలంగాణ టూరిజం ప్రమోషన్

- పాల్గొన్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



జడ్చర్ల, నవంబర్ 3 (జనంసాక్షి): లండన్‌లోని ఎక్సెల్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న అంతర్జాతీయ పర్యాటక ప్రదర్శన వరల్డ్ ట్రావెల్ మార్కెట్ 2026 లో తెలంగాణ పర్యాటక శాఖ ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేసి పర్యాటక విశేషాలను ప్రపంచస్థాయిలో ప్రచారం చేస్తోందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి తెలిపారు. ఈ స్టాల్‌ను కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, రాజ్యసభ సభ్యురాలు సుధా మూర్తి ప్రారంభించినట్లు ఆయన వెల్లడించారు. మంగళవారం లండన్‌లో జరిగిన టూరిజం ప్రమోషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, సుధా మూర్తి తదితర ప్రముఖులతో మాట్లాడారు. తెలంగాణలోని చారిత్రక కట్టడాలు, ఆధ్యాత్మిక కేంద్రా లు, వైవిధ్యమైన సంస్కృతి సంప్రదాయాలను అంతర్జా తీయ వేదికపై ప్రదర్శించడం వల్ల రాష్ట్ర పర్యాటక రంగానికి విశేష గుర్తింపు లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ కార్యదర్శి సిక్తా పట్నాయక్, పర్యాటక శాఖ డైరెక్టర్ రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనానికి కోటి 43 లక్షల నిధులు మంజూరు

- ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన డిఎన్ఆర్



ఉర్కొండ, నవంబర్ 3 (జనంసాక్షి); ఊర్కొండ మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పి హెచ్ సి)భవన నిర్మాణానికి రూ.1 కోటి 43 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి చొరవతో నిధులు మంజూరు కావడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో వైద్య సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలకు అండగా నిలుస్తూ పీహెచ్ సి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారని, అభివృద్ధి పనులపై నిరంతరం పర్యవేక్షణ చేస్తూ అధికారులతో చర్చిస్తున్నారని మాజీ సర్పంచ్ ద్యాప నిఖిల్ రెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు. ఊర్కొండ మండలాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలపాలనేదే ఎమ్మెల్యే లక్ష్యమని, నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు మండల ప్రజల తరపున కృతజ్ఞతలు అన్నారు.

కావేరమ్మపేటలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

- మాజీ కౌన్సిలర్ బుక్క మహేష్



జడ్చర్ల, నవంబర్ 3 (జనంసాక్షి): మున్సిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేటలో వేధిస్తున్న విద్యుత్ సమస్యలు, తీవ్రమైన లో-వోల్టేజ్ ఇబ్బందులను వెంటనే పరిష్క రించాలని కోరుతూ మంగళవారం మహ బూబ్‌నగర్ విద్యుత్ శాఖ సూపరింటెం డింగ్ ఇంజనీర్ భీమా నాయక్‌కు మాజీ వార్డు కౌన్సిలర్ బుక్క మహేష్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ బుక్క మహేష్ మాట్లాడుతూ కావేరమ్మపేట 1వ వార్డు పరిధిలోని ఆటో స్టాండ్, శివాజీ నగర్, పోస్ట్ ఆఫీస్ ఏరియా, చావిడి మెయిన్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో దాదాపు 150 కుటుంబాలు లో-వోల్టేజ్ సమస్యతో తీవ్ర అవస్థలు పడుతున్నాయని తెలిపారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా, ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నా ఎలాంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చేటమోని మహేష్ ఇంటి నుంచి జుర్రు రమేష్ ఇంటి వరకు 4 కొత్త విద్యుత్ స్తంభాలు నాటి సింగిల్ ఫేజ్ స్థానంలో త్రీ-ఫేజ్ సరఫరా ఏర్పాటు చేయాలని, అలాగే ముష్టి రాజశేఖర్ ఇంటి నుంచి మిద్దే సురేష్ ఇంటి వరకు ఉన్న పాత స్తంభాలను తొలగించి నూతన స్తంభాలు వేయాలని కోరారు. ప్రజా సమస్యలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ శాఖ అధికారులు త్వరితగతిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎండిన పంటలను

వ్యవసాయ అధికారులు సర్వే



మహమ్మదాబాద్, నవంబర్ 03 (జనంసాక్షి): ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం, భూగర్భ జలమట్టం పడిపోవడంతో సాగు చేసిన పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.ఈనేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల వ్యవసాయశాఖ అధికారులు పంట నష్టంపై క్షేత్రస్థాయి సర్వే చేపట్టారు. మంగళవారం మహమ్మదాబాద్ మండల వ్యవసాయ అధికారి నరేందర్ ఆధ్వర్యంలో కంచంపల్లి, షేక్‌పల్లి, చౌదర్‌పల్లి పెద్దతండా గ్రామాల్లో పర్యటించి ఎండిపోయిన పంటలను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో సుమారు. 30 ఎకరాల్లో పంటలు నీరందక ఎండిపోయినట్లు ప్రాథమికంగా గుర్తించారు. వ్యవసాయ బావులు,బోర్లలో నీరు అడుగంటడం వల్ల పంటలకు సాగునీరు అందక రైతులు నష్ట పోయినట్లు అధికారులు గుర్తించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పంట నష్ట వివరాలను క్షేత్రస్థాయిలో సేకరిస్తున్నామని, ఎండి పోయిన పంటల విస్తీర్ణం,నష్టపోయిన రైతుల వివరాలను నమోదు చేస్తున్నామని వ్యవసాయ అధికారి నరేందర్ తెలిపారు.ఈసర్వే కార్యక్రమంలో చౌదర్‌పల్లి పెద్దతండా సర్పంచ్ రాకేష్, ఏఈఓ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి

జీఎంఆర్ ఫౌండేషన్ ఆర్థిక సాయం



కొత్తపల్లి-నిజాంపేట, నవంబర్ 3 (జనంసాక్షి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కొత్తపల్లి గ్రామానికి చెందిన చాకలి సాయిలు కుటుంబాన్ని జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రపు మచ్చేందర్ పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలవడమే ఫౌండేషన్ లక్ష్యమని ఆయన తెలిపారు. కుటుంబానికి అండగా నిలిచిన ఫౌండేషన్‌కు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవయ్య, నవీన్, కిష్టయ్య, ఫౌండేషన్ ప్రతినిధులు నమిల్ల హన్మండ్లు, కృష్ణ, శివ, పోచయ్య, శ్రీకాంత్, మహేష్ పాల్గొన్నారు.

రెవెన్యూ సేవల్లో అలసత్వాన్ని సహించేది లేదు

ఆధార్ తరహాలో ప్రతి భూమికి 12 అంకెల ప్రత్యేక భూధార్ నంబర్ కేటాయించే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. భూధార్ నంబర్‌ను ల్యాండ్ బేస్డ్ మ్యాప్‌తో అనుసంధానం చేయడం ద్వారా భూముల హక్కులు, సరిహద్దులపై స్పష్టత వస్తుందని తెలిపారు. కోర్టులు, ట్రిబ్యునళ్లలో పెండింగ్‌లో ఉన్న భూ వివాదాలకు సంబంధించి అవసరమైన రికార్డులతో సకాలంలో కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలన్నారు. అటవీ, రెవెన్యూ భూముల సరిహద్దు వివాదాలపై సంయుక్త సర్వేలు నిర్వహించాలని ఆదేశించారు. జీవో 59 కింద వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన పేదలకే ప్రయోజనం కల్పించాలని, పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణి ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. క్షేత్రస్థాయి పరిశీలనలో వెల్దుర్తి తహసీల్దార్‌కు రీ సర్వే నిర్వహణపై అవగాహన లేకపోవడంపై అసహనం వ్యక్తం చేసిన కలెక్టర్, ఆయనపై చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ నగేష్‌ను ఆదేశించారు. జిల్లాలో ప్రారంభించాల్సిన 530 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 280 ప్రారంభించామని, 14 కేంద్రాల ద్వారా 412 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ల్యాండ్ అక్విజిషన్ లక్ష్యాలను కూడా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్వో అంబదాస్ రాజేశ్వర్, ట్రైనీ కలెక్టర్ మహమ్మద్ అహ్మద్, అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

అగ్రిస్టాక్ అమలుకు జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు

- **కమిటీ చైర్‌పర్సన్‌గా జిల్లా కలెక్టర్ ప్రియాంక**

నారాయణపేట జిల్లా బ్యూరో, నవంబర్3 (జనంసాక్షి): రైతులకు నాణ్యమైన, పారదర్శకమైన, వేగవంతమైన ప్రభుత్వ సేవలు అందించేందుకు అగ్రిస్టాక్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ ప్రియాంక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్రిస్టాక్ కార్యక్రమం అమలు, విధివిధానాలు, వివిధ శాఖల మధ్య సమన్వయంపై సమీక్షించి, అగ్రిస్టాక్ జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ చైర్‌పర్సన్‌గా జిల్లా కలెక్టర్ ప్రియాంక, కన్వీనర్‌గా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్ వ్యవహరించనున్నారు.



అగ్రిస్టాక్ ద్వారా రైతులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని డిజిటల్ విధానంలో నమోదు చేయడంతో పాటు వ్యవసాయం, అనుబంధ రంగాలు, బ్యాంకింగ్, మార్కెటింగ్, పంటల కొనుగోలు తదితర సేవలను సమన్వయం చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. తద్వారా అర్హులైన రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వ్యవసాయ సేవలు పారదర్శకంగా, వేగంగా అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో అగ్రిస్టాక్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, రైతులకు ఈ కార్యక్రమం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. రైతుల వివరాల నమోదు, భూముల రికార్డుల అనుసంధానం, వ్యవసాయ సంబంధిత సమాచార సేకరణలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ట్రైనీ కలెక్టర్ ఫణి కుమార్, డిఆర్డిఓ వెంకట్ రాములు, ఎల్‌డీఎం సురేష్ ఆత్రేయ, జెడ్పీ డిప్యూటీ సీఈవో సుజాత, హౌసింగ్ పీడీ శంకర్ నాయక్, మార్కెటింగ్ తదితర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పటించాలి

- **హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి**
- **ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి**
- **వాహనదారులకు పూలు అందిస్తూ రోడ్డు భద్రతపై సందేశం**
- **యూరో కిడ్స్ పాఠశాల విద్యార్థుల అవగాహన**



సంగారెడ్డి నవంబర్ 3 (జనంసాక్షి): రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని యూరో కిడ్స్ పాఠశాల విద్యార్థులు వాహనదారులకు అవగాహన కల్పించారు. మంగళవారం సంగారెడ్డి పట్టణంలోని ఐబీ చౌరస్తా వద్ద మున్సిపల్, ట్రాఫిక్, పోలీస్ శాఖల సహకారంతో యూరో కిడ్స్ పాఠశాల విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు వాహనదారులకు పూలు అందిస్తూ హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, రహదారి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. చిన్నారులు వినూత్నంగా చేపట్టిన ఈ కార్యక్రమం వాహనదారులను ఆకట్టుకుంది



ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ట్రాఫిక్ సిఐ రామకృష్ణారెడ్డి.ముఖ్య అతిథులుగా హాజరై ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. వాహనదారులు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా రహదారి నియమాలను పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని, విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. చిన్నారుల ద్వారా ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు.



ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ రామకృష్ణారెడ్డి, టౌన్ సీఐ రామ నాయుడు, యూరో కిడ్స్ పాఠశాల ప్రిన్సిపల్ అర్చన, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సాజిద్, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎలినినో ప్రభావాన్ని తట్టుకునేలా కూరగాయల సాగు చేపట్టాలి...

- **తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించే శాస్త్రీయ పద్ధతులు పాటించాలి**
- **జిల్లా ఉద్యానవన అధికారి విజయభాస్కర్**

వనపర్తి నవంబర్ 3 (జనంసాక్షి): ఎలినినో ప్రభావంతో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, నీటి ఎద్దడి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కూరగాయల రైతులు శాస్త్రీయ సాగు పద్ధతులను అవలంబించాలని జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమల అధికారి విజయభాస్కర్ సూచించారు. తక్కువ నీటితో నాణ్యమైన దిగుబడులు సాధించేలా పంటల యాజమాన్య పద్ధతులపై ప్రత్యేక దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. మంగళవారం మదనాపురం కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో కూరగాయల రైతులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డ్రిప్ ఇరిగేషన్, మల్చింగ్ పద్ధతులను అనుసరించడం ద్వారా నీటిని పొదుపు చేయడంతో పాటు నేలలో తేమను కాపాడుకోవచ్చని తెలిపారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కూరగాయల సాగు చేపట్టి పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త రాజేంద్ర కూరగాయల పంటలను ఆశించే చీడపీడలు, తెగుళ్ల గుర్తింపు, సమగ్ర సస్యరక్షణ, సమతుల్య ఎరువుల వినియోగం, నీటి యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. పసుపు, నీలం రంగు జిగురు అట్టలు, ఫెరోమోన్ ట్రాప్స్ వినియోగంతో చీడపీడలను నియంత్రించవచ్చని, అవసరమైనప్పుడు మాత్రమే సిఫార్సు చేసిన పురుగుమందులను సరైన మోతాదులో ఉపయోగించాలని వివరించారు.

ఉద్యానవన అధికారి శివతేజ మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో కూరగాయల సాగు విస్తీర్ణాన్ని పెంచి స్థానిక ఉత్పత్తిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి కూరగాయల దిగుమతులపై ఆధారపడకుండా జిల్లాకు అవసరమైన కూరగాయలను స్థానిక రైతులే పండించేలా ముందుకు రావాలని కోరారు. ఉద్యానవన శాఖ అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త రాజేంద్ర, ఉద్యానవన అధికారి శివతేజ, ఉద్యానవన విస్తరణ అధికారి బాలప్రకాశ్, పలువురు కూరగాయల రైతులు పాల్గొన్నారు.

బీసీ భవనాలపై ప్రభుత్వ పెత్తనం తగదు

- **జీవో నం.14ను వెంటనే రద్దు చేయాలి: పుట్టం పురుషోత్తమరావు**

శివ్వంపేట, నవంబర్ 3 (జనంసాక్షి): తెలంగాణలోని 36 బీసీ కులాల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించడం తగదని తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుట్టం పురుషోత్తమరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం బీసీ కులాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి భూములు, నిధులు కేటాయించి, ఆయా సంఘాలకు యాజమాన్య, నిర్వహణ స్వేచ్ఛ కల్పించిందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నం.14తో భవనాలపై అధికారుల పెత్తనం పెంచి, కుల సంఘాల



స్వయంప్రతిపత్తిని దెబ్బతీస్తోందని విమర్శించారు. భవనాల కమిటీల ఏర్పాటు, నిర్వహణలో ప్రభుత్వ జోక్యం సరికాదన్నారు. సొంత విరాళాలతో నిర్మించిన భవనాలకు సైతం నెలవారీ నివేదికలు కోరడం బీసీల ఆత్మగౌరవాన్ని కించపరచడమేనని పేర్కొన్నారు.

జీవో ఎంఎస్ నం.14 (29-10-2026)ను వెంటనే బేషరతుగా రద్దు చేయాలని, 2018 నాటి జీవోల ప్రకారం బీసీ సంఘాలకు పూర్తి యాజమాన్య, నిర్వహణ హక్కులు కల్పించాలని, కులాల వారీగా పెండింగ్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే 36 బీసీ కులాలు ఐక్యంగా రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతాయని హెచ్చరించారు. బీసీల ఆత్మగౌరవం కోసం లక్షలాది మందితో పోరాటం నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

పుట్టిన గడ్డకు మేలు చేయాలన్నది నా సంకల్పం: మంత్రి వాకిటి శ్రీహరి

- మక్తల్ నియోజకవర్గంలో రూ.2200 కోట్ల అభివృద్ధి పనులు
- మండలంలోని 39 గ్రామాల సమస్యలపై మంత్రి సమీక్ష





మక్తల్, నవంబర్ 03 (జనంసాక్షి):
పుట్టిన గడ్డకు మేలు చేయాలన్నదే తన ధ్యేయమని, నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నట్లు రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. మక్తల్ మండలంలోని సర్పంచ్‌లు, ముఖ్య నాయకులతో మక్తల్ క్యాంపు కార్యాలయంలో ఆయన వేర్వేరుగా సమగ్ర సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ప్రతి గ్రామానికి 20 నుంచి 30 నిమిషాల సమయం కేటాయించి, అక్కడి మౌలిక వసతులు, సమస్యలను స్వయంగా నోట్ చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నియోజకవర్గంలో ఇప్పటివరకు ఎన్నడూ లేనివిధంగా రూ. 2,200 కోట్ల భారీ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. నియోజకవర్గంలో రవాణా వ్యవస్థను మెరుగుపరచడానికి రూ. 500 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. రూ. 237 కోట్లతో మక్తల్–నారాయణపేట నాలుగు లేన్ల రహదారికి నిధులు మంజూరై టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని స్పష్టం చేశారు. మక్తల్ పట్టణంలో అత్యాధునిక వసతులతో రూ. 80 కోట్లతో నిర్మిస్తున్న ఆసుపత్రి ఈ సంక్రాంతిలోపు ప్రజలకు అందుబాటులోకి రానుందని తెలిపారు. అలాగే, క్రీడాకారుల కోసం రూ. 26 కోట్లతో ఆధునిక స్టేడియం నిర్మాణం జరుగుతోందన్నారు. భూత్పూర్ రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన వారి కోసం ఆధునిక హంగులతో నూతన పునరావాస గ్రామాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. అనుగొండకు రూ. 50 కోట్లు, అంకెన్‌పల్లికి రూ. 28 కోట్లు, దాదన్‌పల్లికి రూ. 30 కోట్ల చొప్పున నిధులు కేటాయించినట్లు వెల్లడించారు.
మక్తల్‌లో డిగ్రీ కళాశాలను అందుబాటులోకి తెచ్చామని, విదేశీ విద్యను ప్రోత్సహించేందుకు 64 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 20 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించామని చెప్పారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో పాటు కోర్టు సేవలను మక్తల్‌కే తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు.
అభివృద్ధి పనులు జరుగుతున్నప్పటికీ, వాస్తవాలు తెలుసుకోకుండా ప్రతిపక్షాలు విమర్శలు చేయడం సరికాదని మంత్రి హితవు పలికారు.
మక్తల్–నారాయణపేట రోడ్డుకు ఇప్పటికే నిధులు మంజూరై టెండర్లు పూర్తయినా మాజీ ఎమ్మెల్యే పాదయాత్ర చేయడం ప్రజలను మభ్యపెట్టడమేనని విమర్శించారు.
వ్యక్తిగత ప్రయోజనాల కంటే సమష్టి అభివృద్ధే లక్ష్యంగా నాయకులు పనిచేయాలని, జరుగుతున్న అభివృద్ధిని ప్రజలకు వివరించాలని ఆయన పిలుపునిచ్చారు.

మహబూబ్‌నగర్‌ను కరువు జిల్లాగా ప్రకటించాలి



రాజాపూర్, నవంబర్ 3 (జనంసాక్షి): ఎల్‌నినో ప్రభావంతో ఎండిపోతున్న పంటలను సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ మంగళవారం రాజాపూర్ మండలం మొత్కులకుంట తండాలో పరిశీలించారు. రైతులతో మాట్లాడి సాగు ఖర్చులను తెలుసుకున్నారు. ఎకరా వరి సాగుకు రూ.30 వేలు, పత్తికి రూ.50 వేల వరకు ఖర్చవుతోందని రైతులు వివరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో కొన్ని మండలాలనే కరువుగా ప్రకటించడం సరికాదని, అన్ని మండలాల్లో నీటి కొరతతో పంటలు ఎండుతున్నాయని అన్నారు. మహబూబ్‌నగర్‌ను కరువు జిల్లాగా ప్రకటించి, వరికి ఎకరాకు రూ.30 వేలు, పత్తికి రూ.50 వేల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎం.బాల నరసింహ, బాల కిషన్, రైతులు పాల్గొన్నారు.

మల్లారెడ్డి కాలేజీ విద్యార్థుల రావే యాక్టివిటీ

- పిల్లుట్ల బ్యాచ్ విద్యార్థుల నివేదిక



శివ్వంపేట, నవంబర్ 3 (జనంసాక్షి): మల్లారెడ్డి విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్ బీఎస్సీ చివరి సంవత్సరం విద్యార్థినీలు శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామం లో మంగళవారం రావే యాక్టివిటీ నివేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీలు మండల కేంద్రమైన శివ్వంపేటలోని సహకార బ్యాంకు, అలాగే ఎరువుల దుకాణాలను సందర్శించి, రైతులకు బ్యాంకులు పంట రుణాలను అందించే విధానం, రుణానికి కావలసిన అర్హత, దరఖాస్తు ప్రక్రియ, వడ్డీరెట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎరువుల దుకాణాలలో రైతులకు అందుబాటులో ఉన్న ఎరువులు, విత్తనాలు, పురుగుల మందుల రకాలు, నాణ్యత, విత్తనాల ధరలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బీఎస్సీ (ఆన్సర్) అగ్రికల్చర్ విద్యార్థులు మాట్లాడుతూ గ్రామీణ వ్యవసాయ పనులలో అనుభవం, మెలుకువలు, పెట్టుబడులు, రుణాలు తదితర అంశాలపై అవగాహనా పెంచుకోవడం కోసమే రావే యాక్టివిటీ నివేదిక కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి విశ్వవిద్యాలయం బీఎస్సీ ఫైనల్ ఇయర్ పిల్లుట్ల బ్యాచ్ విద్యార్థులు శ్రీజ, పద్మావతి, కీర్తిమయి, రాధిక, కిరణ్మయి, రోషిణి, తదితరులు ఉన్నారు.

ఏఐకేఎస్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి



ఉప్పునుంతల, నవంబర్ 3 (జనంసాక్షి): నవంబర్ 15 నుంచి 18 వరకు నల్లగొండలో నిర్వహించనున్న అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్. దేశా నాయక్ పిలుపునిచ్చారు. ఉప్పునుంతలలో నిర్వహించిన మండల స్థాయి నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టులు నిర్మించాలని, పోడు భూములకు పట్టాలు, కౌలు రైతులకు న్యాయం చేయాలని కోరారు. పెండింగ్ రుణ మాఫీ, రైతు భరోసా నిధులు విడుదల చేయాలని, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. పంటలకు గిట్టుబాటు ధరలు, నష్టపరిహారం అందించాలని, భూసేకరణలో 2013 చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని అన్నారు. రైతు వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. సమావేశంలో చింతల నాగరాజు, పానుగంటి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం ప్రకటించి ఆదుకోవాలి



మక్తల్, నవంబర్ 3 (జనంసాక్షి): నారాయణపేట జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటివరకు రైతులకు నష్టపరిహారం ప్రకటించకపోవడం సరికాదని సామాజిక కార్యకర్త హెచ్.నర్సింహా అన్నారు. ఇటీవల కురిసిన వర్షం, ఈదురు గాలులకు నేలకొరిగిన వరి పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. విత్తనాలు వేసే సమయంలో, పంటలకు నీరు అవసరమైనప్పుడు వర్షాలు లేక దిగుబడి తగ్గిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. పెట్టుబడులు కూడా తిరిగి రావడం లేదని తెలిపారు. ప్రభుత్వం వెంటనే కరువు ప్యాకేజీ ప్రకటించి ఎకరాకు రూ.25 వేల పరిహారం అందించాలని, పంట బీమా పథకాన్ని అమలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

జలసిరి పనుల పురోగతి సాధించాలి: అదనపు కలెక్టర్ నగేష్





మెదక్ బ్యూరో, నవంబర్ 3 (జనంసాక్షి):
వివిజి రాంజి పథకం – 'జలసిరి' పనుల పురోగతి సాధించాలని అదనపు కలెక్టర్ నగేష్ సంబంధిత ఎంపీడీవోలను ఆదేశించారు. కలెక్టరేట్ ప్రజావాణి హాలులో మంగళవారం జిల్లా లోని గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా చేపడుతున్న జలసిరి పనులు ఫారం పాండ్ ఇంకుడు గుంతలు వ్యక్తిగత, సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణం బోర్‌వెల్ రిఛ్రో సక్చర్ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, వికసిత భారత్ – గ్రామీణ ఉపాధి మరియు జీవనోపాధి మిషన్ హామీ పథకం" పథకం కింద లేబర్ పని దినాలు సంబంధిత అంశాలపై డిఆర్డిఓ పిడి శ్రీనివాసరావు, జడ్పీ సీఈఓ ఎల్ల య్య, డిపిఓ యాదయ్య సంబంధిత ఎంపీడీవోలతో. అదనపు కలెక్టర్ నగేష్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశించిన లక్ష్యాల మేరకు అన్ని పనులు మంజూరు చేసుకుని నవంబర్ 20 తేదీలోపు గ్రౌండింగ్ చేయాలని అన్నారు. జిల్లాలో 390 కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.
ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో నీటి కొరతను ఎదుర్కొనేందుకు పటిష్టంగా పనిచేయ లన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ఎంపీ డీవోలు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటు హక్కును వినియోగించుకోవాలి

- కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు - మట్ట మదన్ కుమార్ గౌడ్



వెల్దండ, నవంబర్ 03 (జనంసాక్షి): పట్టభద్రులైన ప్రతిఒక్కరూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు మట్టా మదన్‌కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైన దని, అర్హులైన పట్టభద్రులందరూ ఓటరు జాబితా లో తమ పేర్లు నమోదు చేసుకొని ఎన్నికల్లో బాధ్యతగా పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ కార్తిక్ కుమార్ ను కలిసి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు సంబంధించిన బీఎల్వో ఫారంను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు మట్టా విష్ణుగౌడ్, కుశా కుమార్, శశికుమార్, తానేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టాయిలెట్లను ప్రారంభించిన సర్పంచ్



మల్దకల్, నవంబర్ 3 (జనంసాక్షి): మండల పరిధిలోని కుర్తి రావులచెరువు గ్రామం గ్రామంలో ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో మంగళవారం కొత్తగా నిర్మించిన టాయిలెట్లను సర్పంచ్ కే భగవంతు ప్రారంభించారు.
కొత్తగా నిర్మించిన టాయిలెట్లను ప్రారంభించి స్కూల్ యాజమాన్యానికి అప్పగించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయరెడ్డి, స్కూల్ పాఠశాల హెడ్మాస్టర్లు క్రాంతికుమార్,కుపేందర్ హెడ్మాస్టర్స్ గ్రామ పెద్దలు వెంకటరెడ్డి,ఉపసర్పంచ్ దేవమ్మ,ధర్మన్న కె,ధనుంజయ,బుచ్చిరెడ్డి, బిసన్న, బుడ్డన్న, దేవన్న,మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ క్రీడాకారిణి రాధ కన్నుమూత



చేర్యాల, నవంబర్ 03 (జనంసాక్షి): చేర్యాల పట్టణ కేంద్రంలోని బీడీ కాలనీకి చెందిన రాష్ట్ర స్థాయి ఖో-ఖో క్రీడాకారిణి రాధ మృతి తీరని లోటని మంగళవారం పలువురు క్రీడాకారులు, ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ సంతాపం తెలిపారు. ముస్త్యాల జడ్పీ స్కూల్ పీఈటీ నర్సయ్య శిష్యురాలైన రాధ ప్రతిభావంతురాలని కొనియాడారు. ఆమె మృతికి హ్యాండ్బాల్ సంఘం అధ్యక్షుడు కందుకూరి ఉపేందర్ గుప్తా, కోచ్ దామెర మల్లేశం, పీడీలు బాలరాజు, ప్రేమ్ కుమార్, రాజ్ కుమార్, సహచరులు రజిత, రేఖ, ప్రేమలత సంతాపం తెలిపారు.

ఎండుతున్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్

- **ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలి: కలెక్టర్ ప్రియాంక**

నారాయణపేట జిల్లా బ్యూరో, నవంబర్ 3 (జనంసాక్షి): ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాల తగ్గుదలతో ఎండిపోతున్న పంటలను జిల్లా కలెక్టర్ ప్రియాంక మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నారాయణపేట మండలంలోని అప్పక్‌పల్లి, చిన్నజట్రం, కొల్లంపల్లి గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడి పంటల పరిస్థితిని తెలుసుకున్నారు.

అప్పక్‌పల్లిలో రైతులు సాగుచేసిన వరి, టమాట, మిరప పంటలను పరిశీలించారు. సకాలంలో వర్షాలు కురవకపోవడం, బోర్లలో నీరు అడుగంటడంతో పంటలకు సాగునీరు అందక ఎండిపోతున్నాయని రైతులు కలెక్టర్‌కు వివరించారు. కౌలుకు భూములు తీసుకుని సాగు చేసినప్పటికీ పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నజట్రం, కొల్లంపల్లిలోనూ ఎండిపోతున్న వరి పంటలను పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ఏడాది వర్షపాతం, సాగు విస్తీర్ణం, దిగుబడులు, పెట్టుబడులు, ఆదాయ వివరాలను సేకరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల సాగుపై ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగుచేయగల ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలన్నారు. నేల స్వభావం, భూగర్భ జలాల పరిస్థితి, అందుబాటులో ఉన్న నీటి వనరులను పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు.

అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి...

వర్షాభావ పరిస్థితుల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు



ఎప్పటికప్పుడు పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి పొదుపు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రకృతి పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ పద్ధతులు మార్చుకోవడం ద్వారా పెట్టుబడి నష్టాలను తగ్గించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్, మండల వ్యవసాయ శాఖ అధికారి, ఏఈవోలు పాల్గొన్నారు.

సదాశివపేటలో బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమావేశం

- **కార్యకర్తలకు అండగా ఉంటా..**
- **కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: ఎమ్మెల్యే చింత ప్రభాకర్**



సదాశివపేట, నవంబర్ 3(జనంసాక్షి): సదాశివపేట మండల బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమావేశం వెల్టూరు శివారులోని పద్మావతి గార్డెన్స్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.



మండల పార్టీ అధ్యక్షుడు పెద్దగొల్ల ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు గడిల సుధీర్ రెడ్డి, కోడూరి రమేష్, కుందనరాజు, పట్టణ పార్టీ అధ్యక్షుడు చిల మల్లన్న, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, యువజన నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, పార్టీ ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో మగ్దుంపూర్ విద్యార్థిని ప్రతిభ

- **జోనల్ స్థాయి పోటీల్లో సత్తాచాటిన సాత్విక**

నంగునూరు(జనంసాక్షి): పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లాలో జరుగుతున్న జోనల్ స్థాయి వాలీబాల్ పోటీల్లో మగ్దుంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదవ





తరగతి విద్యార్థిని గంగరబోయిన సాత్విక సత్తా చాటింది. జోనల్ స్థాయి పోటీలలో సంగారెడ్డి, మెదక్ జిల్లాలపై విజయం సాధించి సిద్దిపేట జట్టు విజేతగా నిలవడంలో సిద్దిపేట జిల్లాకు ప్రాతినిధ్యం వహించిన సాత్విక కీలక పాత్ర పోషించింది. అండర్-14 బాలికల జట్టుకు ఎంపికై రాణిస్తున్న సాత్విక వ్యాయామ ఉపాధ్యాయుడు తడకంటి రాజు సారథ్యంలో వాలీబాల్ క్రీడలో మెళకువలు నేర్చుకుంది. జోనల్ స్థాయిలో ప్రతిభ కనబరిచి సిద్దిపేట జిల్లా జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన సాత్వికను, సాత్వికకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు తడకంటి రాజును పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాసరి సుధాకర్, మగ్దుంపూర్ సర్పంచి పాకాల శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు జీడిపల్లి సురేందర్ రెడ్డి, దుద్దెడ పరశురాములు, ఖైరు సత్తయ్య, దీకొండ గోవర్ధన్, అదిరాల సాయినాథ శర్మ, ముస్మీరు రాజయ్య, అనరాజు స్వప్న తదితరులు అభినందించారు.

సదస్సుకు విచ్చేసి.. దరఖాస్తులు సమర్పించి...

పాపన్నపేట, నవంబర్ 3 (జనంసాక్షి): సమస్యలపై వినియోగదారులు అధికారులకు నేరుగా ఫిర్యాదు చేశారు. విద్యుత్ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా మంగళవారం నార్సింగి విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో



ఈ సదస్సును నిర్వహించారు. అధికారులు 5 మండలాల పరిధి లోని రైతులు,ప్రజల నుండి 14 దరఖాస్తులను స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్‌శాఖ ఏఈలు నర్సింలు, ఉదయ్ కుమార్, శ్యామ్ సుందర్, నవాజ్, రామామూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఉపకేంద్రం సిబ్బందికి షోకాజు నోటీసులు...

- **పాఠశాల, కళాశాలలను తనిఖీ చేసిన కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**

గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 3 (జనంసాక్షి): మానవపాడు మండలం జల్లాపురం గ్రామంలోని వైద్య ఉపకేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపకేంద్రానికి తాళం వేసి ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది అందరికీ షోకాజు నోటీసులు జారీ చేయాలని డీఎంహెచ్‌వో సంధ్య కిరణ్మయిని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని జడ్పీహెచ్‌ఎస్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు.

విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరవుతూ చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పదో తరగతి విద్యార్థులు వెనుకబడిన సబ్జెక్టులపై దృష్టి సారించి ప్రణాళికాబద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణతతో పాటు ప్రతి విద్యార్థి 550కు పైగా మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, మెనూ ప్రకారం భోజనం అందించకపోవడంతో ప్రస్తుత ఏజెన్సీని తొలగించి కొత్త ఏజెన్సీని నియమించాలని ప్రధానోపాధ్యాయుడు విష్ణువర్ధన్‌ను ఆదేశించారు.

గ్రామంలో పేరుకుపోయిన చెత్తాచెదారంపై అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్ పారిశుద్ధ్య పనులు వేగవంతం చేయాలని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శి శ్రీధర్‌రెడ్డిని ఆదేశించారు.



అనంతరం మానవపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

ఇంటర్మీడియట్ విద్య జీవితంలో కీలకమని, ఇంజనీరింగ్, వైద్య విద్య వంటి ఉన్నత లక్ష్యాలను చేరుకునేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికతో చదవాలన్నారు. చరవాణుల వినియోగాన్ని తగ్గించి ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా వంటి ఆన్‌లైన్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆంగ్ల భాష, కమ్యూనికేషన్, కంప్యూటర్ నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధ్యాపకులను ఆదేశించారు. ఈ పర్యటనలో సర్పంచ్ నందిని, ఇంటర్ నోడల్ అధికారి హృదయరాజ్, తహసీల్దార్ మన్సూర్ అలీ సిద్దిఖీ, ఎంపీడీవో రాఘవ, కళాశాల ప్రిన్సిపాల్ మంజులతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

యాసంగిలో వరికి బదులుగా ఆరుతడి పంటలను సాగుచేయాలి

- **మండల వ్యవసాయ అధికారి వెంకటేశం**

కల్హేర్, నవంబర్ 03 (జనసాక్షి): కల్హేర్ మండలంలోని మార్డి గ్రామ పంచాయతీ భవనంలో ఎల్‌నినో ప్రభావం మరియు యాసంగి పంటల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.



ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి వి. వెంకటేశం మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు కారణంగా భూగర్భ జలమట్టాలు తగ్గుతున్న నేపథ్యంలో రాబోయే యాసంగి సీజన్‌లో రైతులు అధిక నీటి వినియోగం అవసరమయ్యే వరి పంట సాగును నివారించాలని సూచించారు. వరికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగు చేయగల శనగ, కుసుమ, వివిధ పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు



మరియు కూరగాయల పంటలను సాగు చేయాలని రైతులకు వివరించారు. భూగర్భ జలాలను సంరక్షించుకోవడం, నీటి వినియోగాన్ని తగ్గించడం, పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహించడం ద్వారా భవిష్యత్తులో సాగునీటి సమస్యలను అధిగమించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వి. వెంకటేశం, వ్యవసాయ విస్తరణ అధికారి టి. నాగేందర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఆయిల్‌పామ్ ఫీల్డ్ ఆఫీసర్, గ్రామ సర్పంచ్, ప్రజాప్రతినిధులు మరియు రైతులు పాల్గొన్నారు.

ఎండిన వరి పంటకు ఎకరానికి రూ.50 వేల పరిహారం ఇవ్వాలి

- **సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ డిమాండ్**

కోహెడ, నవంబర్ 3 (జనంసాక్షి): సాగునీటి కొరతతో ఎండిపోయిన వరి పంటలకు ఎకరానికి రూ.50 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కోహెడ మండలంలోని పరివేద, కూరెళ్ల గ్రామాల్లో సీపీఐ నాయకులతో కలిసి ఎండిపోయిన వరి పంటలను పరిశీలించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోర్లు, బావులు అడుగంటిపోవడం, కాలువల ద్వారా సాగునీరు అందక చివరి దశలో వరి పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదన్నారు.



వ్యవసాయ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి సర్వే నిర్వహించి పంట నష్టాన్ని అంచనా వేయాలని కోరారు.

నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరానికి రూ.50 వేల పరిహారం వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రైతుల పక్షాన సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

పందెం వాగుకు ముప్పు

నిర్మాణాల మాటున నాలా కబ్జా ఆరోపణలు

- సామాన్యుల నిర్మాణాలకేనా హైడ్రా కూల్చివేతలు
- బడా బాబుల ఆక్రమణలు కనిపించవా?

రాజేంద్రనగర్,నవంబర్3(జనంసాక్షి) : నార్సింగ్ సర్కిల్ పరిధిలోని పుప్పాలగూడ లోని సర్వే నంబర్లు 128పి,129పి,130 పి, 145, 145పి, 147, 148పి, 149 పి ఆనంద హోమ్స్ లెగసి నిర్మాణ సంస్థలో భాగంగా స్వలాభం కోసం పందెం వాగు నాలా ఆక్రమణలకు గురవుతూ క్రమంగా కుంచించుకుపోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాలా పరిరక్షణ బాధ్యత కలిగిన హైడ్రా అధికారులు సైతం ఈ వ్యవహారంపై మౌనం వహించడంపై పలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. సామాన్యుల ఇళ్ల కూల్చివేతలకే పరిమితమా? బడా నిర్మాణ సంస్థల ఆక్రమణలపై చర్యలు తీసుకోవడానికి ఎందుకు వెనుకడుగు వేస్తున్నారని నిలదీస్తున్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం సుమారు 100 మీటర్ల వెడల్పు ఉండాల్సిన నాలా ప్రస్తుతం మట్టి పోసి పూడ్చివేయడంతో దాదాపు 30 మీటర్లకు కుదించుకుపోయిందని ఆరోపిస్తున్నారు. నాలా విస్తీర్ణం తగ్గిపోవడం వల్ల వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి, భారీ వర్షాల సమయంలో మణికొండలోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాలా పరిసరాల్లో బఫర్ జోన్ ఆక్రమణలు, ప్రహరీ నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ భూములు, చెరువులు, నాలాలను పరిరక్షించాల్సిన హైడ్రా బడా నిర్మాణ సంస్థల విషయంలోనూ సమానంగా వ్యవహరించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా హైడ్రా, ఇరిగేషన్, హెచ్ఎండీఏ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి నాలా అసలు విస్తీర్ణాన్ని నిర్ధారించాలని, ఆక్రమణలు నిజమని తేలితే వాటిని తొలగించి పందెం వాగు ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఇరిగేషన్ అధికారినికి వివరణ కోరగా గతంలో ఎంత వెడల్పు ఉండేదో ప్రస్తుతం ఎంత ఉందో మీరే కొలుచుకోమణి చెప్పడం బాధ్యతారాహిత్యానికి అద్దం పడుతోంది. ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికారులదా? లేక నాలా వెడల్పును కొలిచి అధికారులకు వివరించాల్సిన బాధ్యత ప్రజలదా? పందెం వాగు నాలా వెడల్పుపై ప్రశ్నిస్తే మీరే కొలుచుకోండంటూ సమాధానం చెప్పడం అధికారుల బాధ్యతారాహిత్యానికి అద్దం పడుతోంది. ప్రభుత్వ రికార్డుల్లో ఉండాల్సిన వివరాలు ప్రజలకు తెలియకపోతే, ఇక నాలాల పరిరక్షణ ఎలా సాధ్యమవుతుంది? ఆక్రమణలను గుర్తించి తొలగించాల్సిన అధికారులే ఇలా స్పందిస్తే ప్రజల సమస్యలకు దిక్కెవరు? ఇప్పటికైనా అధికారులు బాధ్యతగా వ్యవహరించి పందెం వాగు అసలు విస్తీర్ణాన్ని వెల్లడించి, ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి. నాలా కుంచించుకుపోవడానికి అప్పటి మున్సిపల్ అధికారులు నిర్మించిన ప్రహరీ గోడలే కారణమని చెప్పడం అధికారుల మధ్య సమన్వయ లోపాన్ని స్పష్టం చేస్తోందని స్థానికులు విమర్శిస్తున్నారు. నాలా కబ్జాలు, బఫర్ జోన్ ఆక్రమణలపై హైడ్రా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఎన్ఎన్డిపి, ఇరిగేషన్, అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల సమస్య పరిష్కారం కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో భారీ వర్షాలు కురిస్తే నాలా కుంచించుకుపోవడంతో మణికొండలో ముంపు సమస్య తీవ్రతరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సీఎంసీ కమిషనర్ సృజనతో పాటు హెచ్ఆర్డీసీఎల్, హెచ్ఎండీఏ, ఇరిగేషన్ అధికారులు స్పందించి ప్రభుత్వ భూమి కేటాయింపులపై స్పష్టత ఇవ్వాలని, పందెం వాగు నాలాపై సమగ్ర సర్వే నిర్వహించి ఆక్రమణలు తొలగించి, అసలు వెడల్పును పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు. లేకుంటే భవిష్యత్తులో ముంపు సమస్యలకు బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నిస్తున్నారు.





అయ్యప్ప స్వాములకు ఐదేళ్లుగా నిత్య అన్నదాన సేవ

అయ్యప్ప దీక్షలో భక్తితో పాటు సేవాభావానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. ఆకలితో వచ్చే స్వాములకు అన్నం పెట్టడం కేవలం ఆహారం అందించడం మాత్రమే కాదు.. భగవంతుడికి చేసే సేవగా భావించాలి. ఐదేళ్లుగా వేలాది మంది స్వాములకు నిరంతరాయంగా అన్నదానం చేస్తూ ఐడియల్ బిల్డర్ సురేష్ స్వామి చూపిస్తున్న ఔదార్యం అభినందనీయం. భక్తితో సంపాదించిన సంతృప్తిని సేవ రూపంలో పంచుకుంటూ అన్నదానమే మహాదానమనే సందేశాన్ని చాటుతున్నారు.

రాజేంద్రనగర్,నవంబర్3(జనంసాక్షి)

అయ్యప్ప స్వాముల పట్ల భక్తి, సేవాభావంతో ఐడియల్ బిల్డర్ సురేష్ స్వామి గత ఐదు సంవత్సరాలుగా నిరంతర అన్నదాన సేవ నిర్వహిస్తున్నారు. సేవయే పరమావధిగా భావిస్తూ అయ్యప్ప స్వాములకు మధ్యాహ్నం అన్నప్రసాదం, సాయంత్రం అల్పాహారం అందిస్తూ తన భక్తిని చాటుకుంటున్నారు. అయ్యప్ప మాలధారణ చేసిన ఐడియల్ బిల్డర్ సురేష్ స్వామి ఆధ్వర్యంలో అక్టోబర్ 31 నుంచి డిసెంబర్ 11, 2026 వరకు మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని కుందన్ నగర్, అల్కాపూర్ రోడ్ నంబర్ 13 పార్కు వద్ద ప్రతిరోజూ నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సేవా కార్యక్రమంలో రోజుకు సుమారు 800 నుంచి 900 మంది అయ్యప్ప స్వాములు బిక్ష స్వీకరిస్తున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాదంతో పాటు సాయంత్రం అల్పాహారం అందిస్తుండటంతో స్వాముల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ సందర్భంగా సురేష్ స్వామి మాట్లాడుతూ అయ్యప్ప స్వాములకు అన్నదానం చేయడం తనకు ఎంతో సంతృప్తినిచ్చే సేవ అని, స్వాములందరూ బిక్ష స్వీకరించి అయ్యప్ప స్వామి కృపకు పాత్రులు కావాలని ఆహ్వానించారు.

రోజూ 800 నుంచి 900 మంది స్వాములకు అన్నప్రసాదం, అల్పాహారం..

ఐడియల్ బిల్డర్ సురేష్ స్వామి సేవకు విశేష స్పందన







